సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 18.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 348
పేజీలు: 08 వెల: రూ. 5

పులివెందులలో ఉద్రిక్తత

టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఫైటింగ్

- పరస్పరం రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
- గాల్లోకి పోలీసుల కాల్పులు
- 'స్థానిక' సమరం వేళ ఏపీలో రెండో రోజూ హైటెన్షన్



02

నాకూ నోటీసొచ్చింది..

బీజేపీకి నచ్చని ఓట్లను తొలిగిస్తున్నారు

- ఏకపక్షంగా తొలిగించే కుట్ర
- ఈడీ , సీబీఐతో రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగం
- మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం



02

ప్రజా చైతన్యానికి యువ దర్శకులు

భారతీయ సినిమాకు హైదరాబాద్‌ను ప్రధాన కూడలిగా తీర్చిదిద్దుతాం: భట్టి విక్రమార్క

కదలాలి

- సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక
- వాతావరణ మార్పులు, నీటి సంక్షోభంపై షార్ట్‌ఫిల్మ్‌లతో అవగాహన కల్పించాలి
- యువ సినీ ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం
- హైదరాబాద్ శిల్ప కళావేదికలో బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్




ముద్ర, హైదరాబాద్:
యువ ఫిలిం మేకర్లు తమ సృజనాత్మకతతో సమాజాన్ని ఆలోచింపజేసే లఘు చిత్రాలను రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. బతుకమ్మ పండుగలో రంగురంగుల పూలు ఎలా విరబూస్తాయో, యువ ఫిలిం మేకర్ల జీవితాలు కూడా విజయాలతో అలా వికసించాలని ఆకాంక్షించారు. యువ దర్శకులు మంచి కథలతో మిగతా 02లో

సర్‌పై కాంగ్రెస్

సమర శంఖం!

హైదరాబాద్‌లో 2 లక్షల మందితో భారీ సభ.. మార్చ్‌కు కసరత్తు

- రాహుల్ గాంధీ, ఖర్గేకు ఆహ్వానం..
- దసరా తర్వాత ముహూర్తం
- 'సర్' తోపాటు డీలిమిటేషన్ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహం
- దక్షిణాదిపై కాంగ్రెస్ ప్రత్యేక ఫోకస్
- SIRకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని నిర్ణయం
- ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ పోరుబాట
- బీజేపీపై ఒత్తిడి పెంచేందుకు కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్



ముద్ర, తెలంగాణ బ్యూరో:
ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)పై కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో సుమారు రెండు లక్షల మందితో భారీ బహిరంగ సభ, మార్చ్ నిర్వహించేందుకు తెలంగాణ కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఈ కార్యక్రమానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా జాతీయ స్థాయి నేతలను ఆహ్వానించే యోచనలో పార్టీ నాయకత్వం ఉంది. దసరా తర్వాత సభ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

దక్షిణాదే లక్ష్యంగా వ్యూహం

SIR ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ అంశాన్ని ప్రజాస్వామ్య హక్కులు, ఎన్నికల పారదర్శకతతో ముడిపెట్టి ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. ఇప్పటికే ఢిల్లీలో నిరసనలు చేపట్టిన పార్టీ.. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఉద్యమాన్ని విస్తరించేందుకు సిద్ధమవుతోంది. SIRతోపాటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై చర్చను పెంచాలని యోచిస్తోంది.

రెండు లక్షల మందితో జనసమీకరణ

హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు భారీగా జనసమీకరణ చేయాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. సభా వేదిక, తేదీ, మార్చ్ మార్గం, ట్రాఫిక్ ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల భాగస్వామ్యంపై రాష్ట్ర నాయకత్వం కసరత్తు చేస్తోంది. ఈ అంశాలపై సీఎం రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చర్చించనున్నారు. అయితే సభ తేదీ, వేదిక, జాతీయ నేతల హాజరుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

బీజేపీపై రాజకీయ ఒత్తిడికి ప్రయత్నం

SIR అంశంపై నిరసనల ద్వారా ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తడంతో పాటు బీజేపీపై రాజకీయ ఒత్తిడి పెంచాలని కాంగ్రెస్ భావిస్తోంది. తెలంగాణలో భారీ సభ నిర్వహించి జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని చర్చనీయాంశంగా మార్చాలని యోచిస్తోంది. అయితే కాంగ్రెస్ ప్రస్తావిస్తున్న ఓట్ల తొలగింపు అంచనాలకు సంబంధించి అధికారిక గణాంకాలను ఎన్నికల సంఘం వివరాలతో సరిపోల్చాల్సి ఉంది. హైదరాబాద్ సభకు ఎంత మంది హాజరవుతారు? కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకున్న జనసమీకరణ సాధ్యమవుతుందా? SIRపై చేపట్టనున్న ఉద్యమం జాతీయ రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా ఉంది.



02

కత్తి ఆంధ్రావాడిది పొడిచేది తెలంగాణోడు

సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ కీలక వ్యాఖ్యలు

- తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెట్టారు
- ఎల్‌నినో సాకు.. ప్రభుత్వ వైఫల్యమే కారణం
- చంద్రబాబు లేఖపై హరీష్ సంచలన వ్యాఖ్యలు

315 మండలాల్లో కరువు

'ఖేత్ బచావో అభియాన్'పై కేంద్ర మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి తుమ్మల


02

- కేంద్రం తక్షణ సహాయం అందించాలి
- సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి
- ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించాలి
- వ్యవసాయ కూలీలకు ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

కాంగ్రెస్‌కు కొత్త ఆశాకిరణం!

రాహుల్ గాంధీలో కొత్త ఉత్సాహం

ప్రత్యామ్నాయ రాజకీయాలకు కొత్త స్వరం

- యువత, సామాజిక న్యాయమే అజెండా
- భారత్ జోడో యాత్రతో ప్రజలకు చేరువ
- మారిన రాజకీయ ఇమేజ్
- ప్రతిపక్షానికి దూకుడైన గొంతుకగా ఎదుగుదల
- కాంగ్రెస్ పునరుజ్జీవనానికి కొత్త దిశ
- వ్యక్తిగత ప్రజాదరణను ఓట్లుగా మార్చగలరా?
- అధికారమే లక్ష్యంగా అసలు పరీక్షకు సిద్ధం

ముద్ర, తెలంగాణ బ్యూరో:
ఒకప్పుడు రాజకీయ అపరిపక్వతకు ప్రతీకగా ప్రత్యర్థుల విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ గాంధీ.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ఆశాకిరణంగా నిలుస్తున్నారు. రాజకీయాల్లో ఆయన నాయకత్వ సామర్థ్యంపై ఎన్నో ప్రశ్నలు తలెత్తినప్పటికీ, కాలక్రమేణా తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకుంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా భారత్ జోడో యాత్రలు, యువత సమస్యలపై గళమెత్తడం, సామాజిక న్యాయాన్ని ప్రధాన అజెండాగా ముందుకు తీసుకురావడం ద్వారా తన రాజకీయ ఇమేజ్‌ను గణనీయంగా మార్చుకున్నారు. ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొంటూ, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు సంధిస్తూ ప్రతిపక్ష రాజకీయాల్లో దూకుడైన స్వరంగా ఎదుగుతున్నారు. ఈ పరిణామాలన్నీ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఆశలను నింపుతున్నాయి. అయితే, మారిన రాహుల్ గాంధీ రాజకీయ వ్యక్తిత్వం పార్టీకి ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తుంది? వ్యక్తిగత ప్రజాదరణను ఎన్నికల విజయాలుగా మార్చగలరా? కాంగ్రెస్‌ను తిరిగి అధికారానికి చేరువ చేయగలరా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

విమర్శల నుంచి విశ్వాసం దిశగా

రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం ఎన్నో ఒడిదుడుకులతో సాగింది. కాంగ్రెస్‌లో కీలక నాయకుడిగా ఎదిగిన తొలి రోజుల్లో ఆయన ప్రసంగాలు, రాజకీయ నిర్ణయాలు, నాయకత్వ శైలిపై ప్రత్యర్థులు తీవ్ర విమర్శలు చేసేవారు. ముఖ్యంగా బీజేపీ నేతలు, ఇతర రాజకీయ ప్రత్యర్థులు ఆయనను లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధించేవారు. 'పప్పు' వంటి వ్యంగ్య వ్యాఖ్యలతో ఆయన రాజకీయ సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపించే ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆ విమర్శల మధ్యే తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన రాహుల్.. క్రమంగా తన పంథాను మార్చుకున్నారు. కేవలం ఎన్నికల ప్రచారాలకు పరిమితం కాకుండా, మిగతా 02లో



రెండేళ్లలో ప్రతి రైతుకూ మ్యాప్‌తో కూడిన భూదార్!

- 'భూభారతి'తో సరికొత్త భూ విప్లవం..
- చింతకాని సభలో మంత్రి పొంగులేటి కీలక ప్రకటన
- ముల్లుమూడ్ రైతులకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా రికార్డుల పంపిణీ
- రెండేళ్లలోనే 71 వేల ఉద్యోగాల భర్తీ..
- త్వరలోనే మరో 20 వేల నోటిఫికేషన్లు
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ.63 వేల కోట్లు


03

ఇథనాల్ తయారీలో చక్కెరపై నిషేధం

కేంద్రం సంచలన నిర్ణయం!

- చక్కెర ధరలకు కళ్లెం..
- చెరుకు రసం నుంచి ఇథనాల్‌కు నో!
- చక్కెర నిల్వలకు భద్రత.. ధరల నియంత్రణకు చర్యలు
- మొక్కజొన్న నుంచే ఇథనాల్.. కేంద్రం కొత్త రూల్స్


03

ఇదీ AI ముద్ర

ఊరువాడ బతుకమ్మ పండుగ సందడితో తెలంగాణ మారుమోగిపోతోంది..



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
ఆదివారం, 18 అక్టోబర్, 2026

డీహైడ్రేషన్ : కొబ్బరి నీటితో హైడ్రేషన్

కొబ్బరి నీటిలో పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవాల సమతుల్యతకు తోడ్పడతాయి. అయితే తీవ్రమైన డీహైడ్రేషన్‌కు కొబ్బరి నీరు ఒక్కటే సరిపోదు. అవసరాన్ని బట్టి వైద్యుల సూచనలు పాటించాలి.



పులివెందులలో ఉద్రిక్తత



ముద్ర, అమరావతి:
ఏపీలో స్థానిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ పొలిటికల్ హీట్ రెట్టింపవుతోంది.నామినేషన్లు మొదలైన రోజు నుండే రాష్ట్రవ్యాప్తంగా.. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శుక్రవారం పుంగనూరు, రాయచోటి, ధర్మవరం ప్రాంతాల్లో ఘర్షణలు జరగగా..శనివారం (అక్టోబర్ 17) మాజీ సీఎం వైసీపీ అధినేత జగన్ ఇలాఖా పులివెందులలో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణలు భగ్గుమన్నాయి. నామినేషన్ వేయడానికి వెళ్లిన వైసీపీ అభ్యర్థులను టీడీపీ శ్రేణులు కవ్వించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.
నామినేషన్ కేంద్రం దగ్గర మోహరించిన వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పులివెందుల నామినేషన్ కేంద్రం రణరంగంగా మారడంతో రంగంలోకి దిగారు పోలీసులు. ఇరువర్గాలను చెదరగొట్టేందుకు గాల్లోకి కాల్పులు జరిపారు పోలీసులు. మొదటి రౌండ్ కాల్పులు జరిపినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో టియర్ గ్యాస్ ప్రయోగించారు పోలీసులు.
అనంతరం ఇరువర్గాలను చెదరగొట్టారు పోలీసులు. శాంతిభద్రతలు అదుపులో పెట్టాల్సిన పోలీసులు టీడీపీ గుండాలను అడ్డుకోకుండా తమను మాత్రమే అడ్డుకుంటున్నారని..ఆరోపిస్తున్నారు వైసీపీ శ్రేణులు.

కత్తి ఆంధ్రావాడిది.. కానీ పొడిచేది తెలంగాణోడు

ముద్ర, తెలంగాణ బ్యూరో:
తెలంగాణలో ప్రస్తుత కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎల్‌నినో (El Nino) ప్రభావం సాకుగా చూపిస్తూ సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతల నుంచి, తప్పిదాల నుంచి తప్పుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నీటి నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.
కత్తి ఆంధ్రావాడిది.. కానీ పొడిచేది తెలంగాణోడు అని హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యమ కాలంలో కేసీఆర్ చెప్పిన మాటలను ఇప్పుడు రేవంత్ రెడ్డి నిజం చేస్తున్నడు అన్నారు. తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రాకు తాకట్టు పెట్టి.. రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నాడని సీఎంపై విమర్శలు గుప్పించారు. ఈ ద్రోహానికి తరతరాలు నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు అని వ్యాఖ్యానించారు.
దేవాదుల ప్రాజెక్టులో మొత్తం 10 మోటర్లతో నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా, కేవలం 3 మోటర్లతో మాత్రమే నడిపించి రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారని హరీష్ రావు మండిపడ్డారు. తెలంగాణ నీటిని వదిలేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా ప్రయోజనం పొందిందని, ఏపీలో తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ ఎలాంటి క్రాప్ హాలిడే పరిస్థితి లేకపోవడానికి రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యమే నిదర్శనమని పేర్కొన్నారు.
తెలంగాణ నీటి హక్కులపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరణశాసనం రాస్తున్నారని హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సమ్మక్క సాగర్ నుంచి నదుల అనుసంధానం చేపడితే ఏపీకి నష్టం జరుగుతుందని పేర్కొంటూ చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.



గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమ్మక్క సాగర్ నుంచి నాగార్జునసాగర్‌కు నదుల అనుసంధానం చేయాలని ప్రతిపాదించిందని, దానికి కేంద్రంతో పాటు గోదావరి పరివాహక రాష్ట్రాలు కూడా ఆమోదం తెలిపాయని ఈ సందర్భంగా హరీష్ రావు గుర్తుచేశారు. కానీ చంద్రబాబు పోలవరం నుంచి బొల్లేపల్లి రిజర్వాయర్‌ను నింపుతూ 150 టీఎంసీల నీటిని ఏపీ గుప్పిట్లో ఉంచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల తెలంగాణ నీటి ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు కొత్త ఆశాకిరణం!

(మొదటి పేజీ తరువాయి)
ప్రజల మధ్యకు వెళ్లడం, వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం వంటి అంశాలపై దృష్టి సారించారు. దీంతో ఆయన రాజకీయ శైలిలో వచ్చిన మార్పు చర్చనీయాంశంగా మారింది.

భారత్ జోడో యాత్ర.. కీలక మలుపు

రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానంలో భారత్ జోడో యాత్ర ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచింది. దేశవ్యాప్తంగా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం, వివిధ వర్గాల సమస్యలను వినడం, సామాజిక ఐక్యత సందేశాన్ని ముందుకు తీసుకెళ్లడం ద్వారా ఆయన తన నాయకత్వానికి కొత్త రూపు ఇచ్చే ప్రయత్నం చేశారు. పాదయాత్ర సందర్భంగా రైతులు, కార్మికులు, యువత, మహిళలు, వివిధ సామాజిక వర్గాల ప్రజలతో మమేకమయ్యారు. ఈ యాత్ర ద్వారా ప్రజలకు చేరువయ్యే నాయకుడిగా తనను తాను పరిచయం చేసుకునే అవకాశం ఆయనకు లభించింది. రాజకీయ ప్రత్యర్థుల విమర్శలకు సమాధానం చెప్పడమే కాకుండా, ప్రజల సమస్యలపై నిరంతరం మాట్లాడే నాయకుడిగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించారు. భారత్ జోడో యాత్ర అనంతరం కూడా ప్రజలతో సంబంధాలను కొనసాగించడం, దేశవ్యాప్తంగా పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంచడం, ప్రతిపక్ష పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం వంటి అంశాలపై రాహుల్ దృష్టి సారించారు. దీంతో ఆయన రాజకీయ ఇమేజ్‌లో మార్పు కనిపించిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అయితే, యాత్రల ద్వారా వచ్చిన ప్రజాదరణ ఎంతవరకు ఓట్లుగా మారుతుందనేది ఎన్నికల సమయంలో స్పష్టమవుతుంది.

యువతే లక్ష్యం.. సామాజిక న్యాయమే అజెండా

రాహుల్ గాంధీ తన రాజకీయ వ్యూహంలో యువతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలు, విద్య, ఆర్థిక అసమానతలు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించాలనే వాదనను ముందుకు తీసుకెళ్తున్నారు. మరోవైపు సామాజిక న్యాయం, కులగణన, అణగారిన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం వంటి అంశాలను తన రాజకీయ అజెండాలో కీలకంగా మార్చుకున్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడటం వంటి అంశాలపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయ వ్యూహంలో భాగంగా కనిపిస్తున్నాయి. సంప్రదాయ ఓటు బ్యాంకుతో పాటు యువత, వెనుకబడిన వర్గాలు, సామాజికంగా అణగారిన వర్గాలను ఆకర్షించడం ద్వారా పార్టీకి విస్తృత మద్దతు సమీకరించాలన్నది ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యంగా భావించవచ్చు. అయితే, ఈ అంశాలను ప్రసంగాలకే పరిమితం చేయకుండా, స్పష్టమైన విధానాలు, అమలు చేయగల హామీలు, బలమైన సంస్థాగత వ్యవస్థ ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంచాల్సిన బాధ్యత కూడా రాహుల్‌పై ఉంది.

ప్రతిపక్షానికి దూకుడైన గొంతుక

ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు సంధించడం, ప్రజా సమస్యలను పార్లమెంట్‌లోనూ బయటా ప్రస్తావించడం ద్వారా రాహుల్ గాంధీ ప్రతిపక్ష రాజకీయాల్లో తనదైన స్థానాన్ని ఏర్పరచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఆర్థిక అసమానతలు వంటి అంశాలపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. అధికార పక్షాన్ని నేరుగా ప్రశ్నించే నాయకుడిగా తన గుర్తింపును బలోపేతం చేసుకుంటున్నారు. అదే సమయంలో, ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం సాధించడం కూడా ఆయన ముందున్న కీలక బాధ్యత. దేశ వ్యాప్తంగా భిన్న రాజకీయ ప్రయోజనాలు కలిగిన పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడం అంత సులభం కాదు. రాష్ట్రాలవారీగా మారుతున్న రాజకీయ పరిస్థితులు, స్థానిక నాయకత్వాల మధ్య విభేదాలు, సీట్ల సర్దుబాట్లు వంటి అంశాలు ప్రతిపక్ష ఐక్యతకు సవాళ్లుగా నిలుస్తాయి. వీటిని అధిగమించి ఉమ్మడి రాజకీయ కార్యాచరణను రూపొందించగలిగితేనే రాహుల్ నాయకత్వానికి మరింత బలం చేకూరుతుంది.

కాంగ్రెస్‌కు పునరుజ్జీవనం తీసుకొస్తారా?


రాహుల్ గాంధీ రాజకీయ ఇమేజ్‌లో వచ్చిన మార్పు కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నప్పటికీ, పార్టీని బలోపేతం చేయడం ఆయన ముందున్న అసలు సవాలు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం, రాష్ట్రాల్లో నాయకత్వ సమస్యలను పరిష్కరించడం, కార్యకర్తల్లో నమ్మకాన్ని పెంచడం, స్థానిక స్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. కేవలం జాతీయ స్థాయిలో కనిపించే నాయకత్వం మాత్రమే ఎన్నికల్లో విజయాలను అందించదు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు పార్టీకి బలమైన యంత్రాంగం అవసరం. స్థానిక సమస్యలను అర్థం చేసుకునే నాయకులు, ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించే కార్యకర్తలు, సమర్థవంతమైన ఎన్నికల వ్యూహం పార్టీ విజయానికి కీలకం. రాహుల్ గాంధీ తన వ్యక్తిగత ప్రజాదరణను పార్టీ సంస్థాగత బలంగా మార్చగలిగితే కాంగ్రెస్‌కు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. అలాగే, కాంగ్రెస్ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలితాలు కూడా పార్టీ జాతీయ ప్రతిష్ఠపై ప్రభావం చూపుతాయి. జాతీయ స్థాయిలో రాహుల్ చెప్పే సందేశానికి, రాష్ట్రాల్లో పార్టీ అనుసరించే విధానాలకు మధ్య స్పష్టమైన అనుసంధానం ఉండాల్సిన అవసరం ఉంది.

వ్యక్తిగత ఇమేజ్ నుంచి ఎన్నికల విజయాల దిశగా..

రాహుల్ గాంధీ ఎదుగుదలను అంచనా వేయాలంటే ఆయన ప్రసంగాలు, యాత్రలు, ప్రజల్లో కనిపిస్తున్న ఆదరణను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం సరిపోదు. ఆ ఆదరణ ఓటర్ల నిర్ణయాలను ఎంతవరకు ప్రభావితం చేస్తుంది? కాంగ్రెస్‌కు కొత్త ఓటర్లను తీసుకువస్తుందా? పార్టీ బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో పునాది వేయగలదా? మిత్రపక్షాలతో కలిసి ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించగలదా? అన్న అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో విజయం సాధించడానికి నాయకుడి వ్యక్తిగత ఆకర్షణతో పాటు స్థానిక నాయకత్వం, అభ్యర్థుల ఎంపిక, కూటముల వ్యూహం, ప్రజా సమస్యలపై స్పష్టమైన వైఖరి, సమర్థవంతమైన ప్రచారం వంటి అనేక అంశాలు కీలకంగా ఉంటాయి. అందువల్ల రాహుల్ గాంధీకి పెరుగుతున్న రాజకీయ గుర్తింపు కాంగ్రెస్‌కు అవకాశాలను సృష్టించవచ్చు. కానీ ఆ అవకాశాలను విజయాలుగా మార్చుకోవడం పార్టీ మొత్తం పనితీరుపైనే ఆధారపడి ఉంటుంది.

'రాహుల్ 2.0'కు అసలైన పరీక్ష

రాజకీయాల్లో ఒక నాయకుడి ఇమేజ్ మారడం ముఖ్యమే. కానీ ఆ మార్పు పార్టీ భవిష్యత్తును ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేదే అంతకంటే ముఖ్యం. రాహుల్ గాంధీ విషయంలోనూ ఇదే ప్రశ్న ఎదురవుతోంది. ఒకప్పుడు విమర్శల మధ్య తన రాజకీయ సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్న ఆయన.. ఇప్పుడు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయాల ముఖచిత్రంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత్ జోడో యాత్రలతో ప్రజలకు చేరువ కావడం, యువత సమస్యలను ప్రస్తావించడం, సామాజిక న్యాయాన్ని ప్రధాన అజెండాగా మార్చడం ఆయన రాజకీయ ప్రయాణంలో కీలక పరిణామాలు. అయితే, ఈ మార్పు శాశ్వత రాజకీయ బలంగా మారాలంటే నిరంతర ప్రజా సంబంధాలు, స్పష్టమైన విధానాలు, బలమైన పార్టీ నిర్మాణం, ఎన్నికల విజయాలు అవసరం. వ్యక్తిగత ప్రజాదరణతో పాటు సంస్థాగత సామర్థ్యాన్ని పెంచుకోవడం, ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం రాహుల్‌కు అత్యంత కీలకం. మొత్తంగా చూస్తే.. 'రాహుల్ 2.0' కాంగ్రెస్‌లో కొత్త ఆశలను రేకెత్తిస్తున్న రాజకీయ పరిణామం. ప్రత్యర్థుల విమర్శల నుంచి బయటపడి తనదైన రాజకీయ స్వరాన్ని వినిపిస్తున్న ఆయన.. దేశ రాజకీయాల్లో ఎంతటి ప్రభావం చూపగలరన్నది రాబోయే కాలమే నిర్ణయిస్తుంది. కాంగ్రెస్‌కు కొత్త దిశ చూపించే నాయకుడిగా ఎదగడం ఒక దశ అయితే, ఆ దిశలో ప్రజల మద్దతును ఎన్నికల విజయాలుగా మలచడం మరో దశ. రాహుల్ గాంధీ రాజకీయ పరివర్తనకు అసలైన గీటురాయి ఎన్నికల ఫలితాలే.



నాకూ నోటీసొచ్చింది

ముద్ర, హైదరాబాద్ :
ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియలో తీవ్ర లోపాలు ఉన్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ విధానంలో పారదర్శకత లోపించిందని, స్వయంగా తనకు కూడా నోటీసు వచ్చిందని ఆయన తెలిపారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికల వ్యవస్థలో అవలంబించాల్సిన ప్రాథమిక నిబంధనలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. 'ఎవరైనా వ్యక్తి మరణిస్తే ఓటు తొలగించాలి.. వేరే ప్రాంతానికి బదిలీ అయితే ఓటు మార్పిడి జరగాలి. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓట్లను ఏకపక్షంగా తొలిగించే కుట్ర జరుగుతోంది' అని విమర్శించారు.
ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మహేష్ కుమార్ గౌడ్, ఇన్నాళ్లూ ఈడీ (ED), సీబీఐ (CBI) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించిన బీజేపీ, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని (EC) కూడా తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. ముఖ్యంగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) నియామక ప్రక్రియలో తెచ్చిన మార్పులను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (CJI)ని ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర వ్యవస్థల విధుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు అని హెచ్చరించారు.

తెలంగాణలో 315 మండలాల్లో కరువు

ముద్ర, హైదరాబాద్:
కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో కూడా ఈ ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని 22 అక్టోబర్ నుండి 30 నవంబర్ వరకు నిర్వహిస్తామని, దీనికి గాను అఖిల భారత వ్యవసాయ సంస్థలు, విశ్వ విద్యాలయాల సిబ్బంది సహకారంతో వీటిని గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని 315 మండలాల్లో కరువు తరహా పరిస్థితులు నెలకొంటున్నాయని మంత్రి తెలిపారు. పంటల పరిస్థితిని అంచనా వేయడం, అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించడం, పంటలు కోతకు వచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన సాగునీరు, విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు.
ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూక్ష్మ సేద్యానికి, మధ్యంతర కాలంలో సాగు చేసే పంటలకు అవసరమైన విత్తనాల కోసం ప్రత్యేకంగా అదనపు బడ్జెట్ కేటాయించాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు ఎదురయ్యే నష్టాలను తగ్గించేందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎరువుల ధరలు, సబ్సిడీల అంశాన్ని ప్రస్తావిస్తూ యూరియాపై అధిక సబ్సిడీ కారణంగా ఇతర ఎరువులతో పోలిస్తే దాని ధర తక్కువగా ఉందని, దీనివల్ల యూరియా అధిక వినియోగం పెరిగి నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని మంత్రి తెలిపారు. రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించి, ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.
రైతులు పంటల మార్పిడికి ముందుకు రావాలంటే పండించిన పంటలకు కనీస మద్దతు ధరపై కొనుగోలు భరోసా కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు సహా అన్ని ప్రధాన పంటలను కనీస మద్దతు ధర (MSP)పై 100 శాతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ధరల మద్దతు పథకం (PSS) కింద ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు.
కరువు పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. VB–G RAM G పథకం కింద నిధుల కేటాయింపును పెంచడంతో పాటు వ్యవసాయానికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం, నీటి సంరక్షణ, భూమి అభివృద్ధి పనులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదని, వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడంతో పాటు పండించిన పంటలకు మార్కెట్‌లో కొనుగోలు భరోసా కల్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రజా చైతన్యానికి యువ దర్శకులు కదలాలి

(మొదటి పేజీ తరువాయి)
ముందుకు వచ్చి, వినోదంతో పాటు సమాజానికి మేలు చేసే చిత్రాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం చేయకుండా, భారతీయ సినిమాకు ప్రధాన కూడలిగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ యువతలోని సినీ ప్రతిభను ప్రోత్సహిస్తూ, జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను ప్రముఖ సినీ గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్–2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని అన్నారు. వివిధ రంగులు, సువాసనలతో కూడిన పూలు ఒకచోట చేరినట్లుగా సమాజంలోని భిన్న వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చే వేడుక బతుకమ్మ అని పేర్కొన్నారు. అందుకే ఈ పండుగ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్‌ను భారతీయ సినిమా పరిశ్రమకు ప్రధాన గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో సృజనాత్మకతకు కొదవలేదని, యువ దర్శకులు, కళాకారులను ప్రోత్సహించి మరిన్ని అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేతృత్వంలో సినీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్‌ను ఆయన అభినందించారు. మూడు గంటల సినిమాలో చెప్పే కథను రెండు, మూడు నిమిషాల షార్ట్‌ఫిల్మ్‌లో చెప్పడం గొప్ప సృజనాత్మకతతో కూడుకున్నదని పేర్కొన్నారు. అవార్డులు రానంత మాత్రాన నిరుత్సాహపడకుండా యువ దర్శకులు తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. షార్ట్‌ఫిల్మ్‌లు, పాటలు, జానపద గీతాలు, వ్యాసాలు తదితర విభాగాల్లో మొత్తం 29 అవార్డులతో యువ ప్రతిభను గుర్తించడం సంతోషకరమన్నారు.

సామాజిక చైతన్యానికి వేదిక కావాలి

సినిమాలు వినోదానికే పరిమితం కాకుండా వాతావరణ మార్పులు, సూపర్ ఎల్‌నినో ప్రభావాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, నీటి కొరత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని భట్టి విక్రమార్క సూచించారు. నీటి సంరక్షణ, వర్షపు నీటి పొదుపు, ప్రకృతి పరిరక్షణ, విద్యుత్ పొదుపుపై ప్రజలకు సందేశాన్నిచ్చేలా షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించాలని కోరారు. చిన్న కథలు కూడా ఆధునిక సాంకేతికతతో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగలవని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కళలు, సృజనాత్మకతపై ఆసక్తి ఉందని, యువతలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 18.10.2026
www.mudranews.in | @mudranews

డీహైడ్రేషన్ : నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు తినండి



పుచ్చకాయ, కర్బూజ, నారింజ, దోసకాయ వంటి వాటిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. వీటిని ఆహారంలో భాగంగా చేర్చుకోవడం వల్ల శరీరానికి ద్రవాలు అందుతాయి. సమతుల్య ఆహారంతో పాటు వీటిని తీసుకోవడం మంచిది.

ఇథనాల్ తయారీలో చక్కెర వినియోగంపై నిషేధం

ముద్ర, న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను నియంత్రించి, దేశీయ అవసరాలకు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026–27 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో చెరుకు రసం, షుగర్ సిరప్, బి–హెవీ మొలాసిస్ నుంచి తయారయ్యే ఇథనాల్ కొనుగోలుపై నిషేధం విధించింది. నవంబర్ 1, 2026 నుంచి అక్టోబర్ 31, 2027 వరకు 1,100 కోట్ల లీటర్ల ఇథనాల్ సేకరణకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు టెండర్లు ఆహ్వానించాయి. కొత్త నిబంధనల ప్రకారం మొక్కజొన్న, నూకలు, ఎఫ్ సీఐ మిగులు బియ్యం నుంచి తయారైన ఇథనాల్ ను మాత్రమే కొనుగోలు చేయనున్నారు. మొక్కజొన్న ఆధారిత ఇథనాల్ ధరను లీటరుకు రూ.68.86గా నిర్ణయించారు. చెరుకు దిగుబడి తగ్గడం, పండుగల సీజన్ లో డిమాండ్ పెరగడం వంటి కారణాలతో చక్కెర ధరలు పెరగడంతో కేంద్రం ఈ చర్యలు చేపట్టింది.

అక్రమ నిల్వలను అరికట్టేందుకు చక్కెర డీలర్లపై 400 టన్నుల స్టాక్ పరిమితి విధించడంతో పాటు, 10 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. అలాగే చెరుకు క్రషింగ్ ను ముందుగానే ప్రారంభించాలని మిల్లులకు సూచించింది. ఈ చర్యలతో మార్కెట్ లో చక్కెర సరఫరా పెరిగి ధరలు నియంత్రణలోకి వస్తాయని కేంద్రం భావిస్తోంది.


రెండేళ్లలో ప్రతి రైతుకూ మ్యాప్‌తో భూదార్ కార్డు

ముద్ర, చింతకాని: రాష్ట్రంలోని ప్రతి భూమిని సర్వే చేసి, సాగులో ఉన్న ప్రతి రైతుకు మ్యాప్‌తో కూడిన 'భూదార్' కార్డును రెండేళ్లలో అందజేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ, భూభారతి కార్యక్రమం ద్వారా భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మధిర నియోజకవర్గంలోని ముల్కుమాడ్‌లో సర్వే పూర్తి చేసి, 476 మంది రైతులకు భూదార్ కార్డులు సిద్ధం చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్లను సున్నా వడ్డీకి అందించామని, తొలి రెండేళ్లలో 71 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని మంత్రి పేర్కొన్నారు. త్వరలో మరో 17 వేల నుంచి 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపించిన ఆయన, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

ముద్ర, తెలంగాణ బ్యూరో: సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలకు, ముఖ్యంగా ఆడబిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాల పాటు కొనసాగాలని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

దసరా ఎఫెక్ట్.. చౌటుప్పల్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్



ముద్ర, హైదరాబాద్ : దసరా పండగ నేపథ్యంలో నగర ప్రజలు సొంతూళ్లకు బయల్దేరి వెళ్తున్నారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ తదితర బస్టాండ్లలో రద్దీ నెలకొంది. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడుపుతోంది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై నల్గొండ జిల్లా చిట్యాల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చిట్యాల వద్ద కొత్తగా ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. దీనిపనుల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

చౌటుప్పల్, బొర్రలగూడెం వద్ద వాహనాలు పూర్తిగా స్తంభించిపోయాయి. గంటసేపటి నుంచి విజయవాడ హైవేపై వాహనదారులు పడిగాపులు కాస్తున్నారు. పోలీసులు, హైవే సిబ్బంది ట్రాఫిక్‌జామ్‌ను పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్–హనుమకొండ రహదారిపై కూడా భారీగా వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

కొడుకు బదులు కూతురు..

జోస్యం తప్పిందని పూజారి దారుణ హత్య

ముద్ర, లక్నో : కొడుకు పుడతాడని పూజారి చెప్పిన జోస్యం తప్పిందని ఏకంగా ఆ పూజారినే హత్య చేశారు తండ్రీ కొడుకులు. ఈ షాకింగ్ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో వెలుగు చూసింది. ఈ కేసుకు సంబంధించి నిందితులైన తండ్రీకొడుకులను పోలీసులు అరెస్టు చేసి విచారించగా ఊహించని ట్విస్ట్ వెలుగు చూసింది. యూపీలోని ముజఫర్‌నగర్‌లో ఉన్న ఓ శివాలయంలో స్వామి దేవానంద్ భారతి (81) అనే వృద్ధ పూజారి అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 13 రాత్రి సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు పూజారిని కాల్చి చంపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పూజారి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, దర్యాప్తు ప్రారంభించారు. విచారణ సమయంలో పోలీసులకు ఘటనా స్థలంలో హరేంద్ర అనే స్థానిక నివాసికి సంబంధించిన ఫోటో లభించింది. దీంతో ఈ కోణంలో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు.. గ్రామానికి చెందిన హషీమ్, ఆయన కుమారుడు జీషన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నేరానికి ఉపయోగించిన బైక్, రెండు దేశీ పిస్టల్స్, తూటాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారు. సుమారు నెలన్నర క్రితం జీషన్ భార్య గర్భవతిగా ఉన్న సమయంలో వారికి మగబిడ్డ పుడతాడని పూజారి దేవానంద్ భారతి జోస్యం చెప్పారు. అయితే ఆ దంపతులకు కూతురు జన్మించింది. పూజారి చెప్పింది తప్పవ్వడంతో ఆగ్రహం చెందిన తండ్రీకొడుకులు ఆయనతో గొడవకు దిగారు. ఈ క్రమంలో తుపాకీతో కాల్చి చంపారు.

దుబాయ్ విల్లా నోవాలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం: గోవర్ధన్ రెడ్డి





ముద్ర, కరీంనగర్ : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని తెలంగాణ ప్రవాసుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా దుబాయ్‌లోని విల్లా నోవా కమ్యూనిటీ లో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. ప్రముఖ వ్యాపారవేత్త గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో తెలంగాణ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, గౌరీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, కోలాటాలు, నృత్యాలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిని ఆరాధించే సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విదేశీ గడ్డపై సైతం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి, చప్పట్లు కొడుతూ లయబద్ధంగా పాటలు పాడారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆలపించిన సంప్రదాయ గీతాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల కోలాటాలు, ఉత్సాహభరితమైన నృత్యాలు, పండుగ వాతావరణంతో విల్లా నోవా కమ్యూనిటీ కళకళలాడింది.

ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. యూఏఈలో నివసిస్తున్న తెలంగాణ ప్రజల ఐక్యతను మరింత బలోపేతం చేయడం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణ పండుగలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా యూఏఈలో పుట్టి పెరుగుతున్న పిల్లలకు తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేయడంలో ఇటువంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రాధాకృష్ణ, అశోక్ రెడ్డి, భగవాన్ రెడ్డితో పాటు విల్లా నోవా కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు. మహిళలు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడంతో బతుకమ్మ సంబరాలు సంప్రదాయబద్ధంగా, ఆహ్లాదకర వాతావరణంలో ముగిశాయి.

జర్నలిస్ట్ రఘు అకాల మృతి తీరని లోటు



ముద్ర, హైదరాబాద్ : తన ఆప్తమిత్రుడు, సీనియర్ పాత్రికేయుడు, RNA మీడియా సంస్థ చీఫ్ ఎడిటర్ అవ్వారి రఘు అకాల మృతి మీడియా రంగానికి తీరని లోటని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(TUWJ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. శనివారం నాడు కోకాపేట లోని రఘు నివాసంలో మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళి అర్పించారు. రఘుతో తనకు మూడు దశాబ్దాల బంధం ఉందని, సాదాసీదా వ్యక్తిత్వం కలిగి ఉన్న ఆయన ఏ సంస్థలో పనిచేసినా, వృత్తి పట్ల తన నిబద్ధతను, అంకితభావాన్ని ప్రదర్శించేవారని విరాహత్ గుర్తుచేసారు. ఈ సందర్భంగా రఘు కుటుంబాన్ని ఆయన ఓదార్చారు.

రఘు మృతి పట్ల ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ఉపాధ్యక్షుడు వై నరేందర్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

అన్నపూర్ణాదేవిగా శ్రీ మాతా నిమిషాంబ దేవి దర్శనం





ముద్ర, బోడుప్పల్: శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సకల జీవకోటికి అన్నాన్ని ప్రసాదించే జగన్మాతను భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని పూజలు నిర్వహించారు. అన్నదానం మహాదానమనే సందేశాన్ని చాటుతూ, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడమే నిజమైన మానవసేవ అని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

నేటి నుంచి నిత్య అన్నప్రసాద వితరణ

బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబికా దేవి ఆలయంలో నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. 2022 నుంచి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఇకపై ప్రతిరోజూ కొనసాగించాలని శ్రీ మాతా నిమిషాంబికా దేవి ట్రస్ట్, హంపి పీఠం ఆధ్వర్యంలో నిర్ణయించారు. ఆదివారం (అక్టోబర్ 18) ప్రారంభం కానున్న ఈ కార్యక్రమం ద్వారా భక్తులకు నిత్యం అన్నప్రసాదం అందించనున్నారు. ప్రారంభోత్సవానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌ను ముఖ్య అతిథిగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్‌ను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేతాజీ నగర్ లో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు





ముద్ర న్యూస్ బ్యూరో, హైదరాబాద్: మెహిదీపట్నం సమీపంలోని నేతాజీ నగర్ కాలనీలో శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కాలనీ లోని శ్రీ ఉమామహేశ్వర సీతారామ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రతి ష్టించిన దుర్గామాత విగ్రహం వద్ద నిత్య పూజలు జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన పూజారి కేశవమూర్తి, మరో పూజారి రాజేష్ పండిట్ ఆధ్వర్యంలో ఉదయం, రాత్రి కుంకుమార్చనలు, హారతులు అత్యంత భక్తుశ్రద్ధలతో జరుగుతున్నాయి. నేతాజీ నగర్ తో పాటు, శ్రీనివాస నగర్, జ్యోతి నగర్ కు చెందిన వందలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో అవతారంలో దర్శనమిస్తున్నారు. శనివారం రాత్రి నిర్వహిం చిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో వెయ్యి మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

బాలాజీ నగర్ లో శరన్నవరాత్రి వేడుకలు



ముద్ర, బాలాజీ నగర్ : బాలాజీ నగర్ లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. నిత్యం వందలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుంటున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. టీజేఎస్ మద్దతు కోరిన కాంగ్రెస్

ముద్ర, హైదరాబాద్ : త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందులో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ శనివారం నాంపల్లిలోని టీజేఎస్ కార్యాలయంలో ప్రొఫెసర్ కోదండరాంతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై చర్చించిన కోదండరాం.. మద్దతు అంశాన్ని పార్టీ రాష్ట్ర కమిటీలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. అంతకుముందు సీపీఎం మద్దతును కూడా కాంగ్రెస్ కోరింది. మరోవైపు బీఆర్ఎస్ సైతం లెఫ్ట్ పార్టీల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పొత్తుల రాజకీయం ఆసక్తికరంగా మారింది.

వరంగల్‌లో కేయూ హబ్ ఏర్పాటు చేస్తాం

- మంత్రి శ్రీధర్‌బాబు



ముద్ర, వరంగల్ : హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ మహా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగానే కేయూ హబ్‌ను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా ముందస్తు చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ధర్మసాగర్ చెరువు నుంచి భద్రకాళి చెరువులోకి గోదావరి జలాలను పంపింగ్ చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. వరంగల్ నగరంలో నిరుద్యోగుల కోసం ఐటీ టవర్స్ ప్రారంభిస్తామన్నారు. భద్రకాళి ఆలయం మాడవీధుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించిందన్నారు. దాతల సహకారంతో కొత్త రథం తయారు చేయించడం అభినందనీయమన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

ఆదివారం,
18 అక్టోబర్, 2026

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..



వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

స్ట్రోక్ ప్రాబ్లమ్స్‌కు
నాలుగే కారణం



గుండెపోటు, పక్షవాతం వంటి ఆరోగ్య సమస్యలు ఎలాంటి హెచ్చరికలు లేకుండా అరుదుగా వస్తాయి. తీవ్రమైన గుండె సమస్యలు ఎదుర్కొన్న వారిని పరిశీలిస్తే ప్రతీ ఒక్కరికీ సమస్య వచ్చే ముందుగా కొన్ని ఆరోగ్య ప్రమాద కారకాలు ఉన్నాయి. అవే హైబీపి, హై కొలెస్ట్రాల్, హైబ్లడ్ ప్రెజర్‌తో పాటు సిగరెట్ స్మోకింగ్ వంటివి ఉండడం. ఈ నాలుగు కారణాల వల్ల ఎక్కువగా గుండె సమస్యలు, స్ట్రోక్స్ వంటివి వస్తున్నాయని జర్నల్ ఆఫ్ ద అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీలో పబ్లిష్ అయిన ఓ అధ్యయనం చెబుతోంది. ఇందులో మరికొన్ని ముఖ్య విషయాలు కూడా ఉన్నాయి.

మహిళలకి కూడా..

గుండె సంబంధిత సమస్యల ప్రమాదం అత్యంత తక్కువగా ఉండే 60 ఏళ్లలోపు మహిళల్లో కూడా 95 శాతానికి పైగా గుండె సమస్యలు, పక్షవాతం రెండు సమస్యలు కూడా పైన చెప్పినట్లుగా హైబీపి, హై బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్, స్మోకింగ్ వంటి కారణాలతోనే వస్తున్నట్లు తేలింది. కాబట్టి, ఎప్పటికప్పుడు ఈ సమస్యలు రాకుండా ముందునుంచీ జాగ్రత్త పడడం చాలా అవసరం. ముఖ్యంగా బ్లడ్ ప్రెజర్ మరింత సమస్యాత్మకంగా మారుతుంది.

బీపీ ఎందుకు ప్రమాదం

గుండె సంబంధిత సమస్యలతో ముడిపడి ఉన్న ప్రమాద కారకం హైబీపి.ఆల్రెడీ గుండెపోటు, పక్షవాతం లేదా హార్ట్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు ఉన్నవారిని పరీక్షించగా తేలిన విషయం ఏంటంటే వారు హైబీపితో బాధపడుతున్నారని. కాబట్టి, ఫ్యూచర్‌లో తీవ్రమైన గుండె సంబంధ సమస్యలు రాకుండా ఉండేందుకు హైబీపిని కంట్రోల్ చేయడం ముఖ్యం. దీనికోసం డాక్టర్‌ని కలిసి సరైన నిర్ణయాలు తీసుకోవాలి.

ప్రాబ్లమ్స్ రాకుండా ఏం చేయాలంటే

నాలుగు సమస్యల కారణంగానే గుండె సమస్యలు, స్ట్రోక్ వంటివి వస్తాయని తెలిసినప్పుడు మనం ఆరోగ్య సమస్యల్ని దూరం చేసుకునేందుకు ముందుగా నాలుగు సమస్యల్ని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అయితే, కొన్నిసార్లు ఈ సమస్యలు లేనప్పటికీ హార్ట్ ప్రాబ్లమ్స్ వస్తాయని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. అయితే, ఈ నాలుగు ప్రాబ్లమ్స్ ఉన్నవారు మరింతగా జాగ్రత్తగా ఉండడం మంచిది. దీంతో పాటు అథెరోథ్రాంబోసిస్ కూడా మరోకారణం.

అథెరోథ్రాంబోసిస్ అంటే

సాధారణంగా చాలా గుండెపోటులకి కారణం అథెరోథ్రాంబోసిస్ అని చెబుతారు. అంటే సమస్య అంటే రక్తపు గడ్డలు గుండెకి రక్తప్రవాహాన్ని అడ్డుకుంటాయి. మహిళల్లో సగానికి పైగా గుండెపోటుకి అథెరోథ్రాంబోసిస్‌యేతర కారణాలు ఉన్నట్లుకనుగొనబడింది. మగవారిలో 75 శాతం గుండెపోటుకి కారణం అథెరోథ్రాంబోసిన్. మహిళల్లో ఇది 47 శాతానికి కారణమైంది. గుండె సమస్యలు రావడానికి స్పాంటేనియస్ కరోనరీ ఆర్టరీ డిసెక్షన్స్ కూడా మరో కారణం. ఈ సమస్య ఉంటే ధమని గోడలలో చీలికల వల్ల రక్తం పేరుకుపోతుంది. మరియు ఎంబోలిజమ్స్.

ఎక్స్‌పర్ట్స్ ఏం చెబుతున్నారంటే

గుండెపోటు ఎందుకు వచ్చిందో తెలుసుకోలేనప్పుడు దాని వల్ల సరిగ్గా ట్రీట్‌మెంట్ తీసుకోలేరు. అందుకే, గుండెపోటుకి ట్రీట్‌మెంట్ తీసుకోవడం ఎంత ముఖ్యమో అది ఎందుకు వచ్చిందో తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం. లేదంటే మరింత ప్రాణాంతకంగా మారతాయి సమస్యలు.

ప్రజలు బంగారాన్ని ఎందుకు
కొనుగోలు చేస్తారు?



బంగారం అంటే కేవలం ఒక విలువైన లోహం మాత్రమే కాదు. వేల సంవత్సరాలుగా మానవ చరిత్రలో, ఆర్థిక వ్యవస్థలో, సంప్రదాయాల్లో బంగారానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆభరణాల తయారీ నుంచి పెట్టుబడుల వరకు అనేక రూపాల్లో బంగారాన్ని ఉపయోగిస్తున్నారు. అయితే, నేటి కాలంలో డబ్బు కాగితాల రూపంలో, బ్యాంకు ఖాతాల్లో డిజిటల్ సంఖ్యల రూపంలో ఉన్నప్పటికీ, ప్రజలు ఇప్పటికీ బంగారాన్ని ఎందుకు కొనుగోలు చేస్తున్నారు? ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరిగినప్పుడు బంగారానికి డిమాండ్ ఎందుకు పెరుగుతోంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే బంగారం చరిత్రను, దాని ఆర్థిక ప్రాధాన్యతను, పెట్టుబడిగా దాని ప్రత్యేకతను అర్థం చేసుకోవాలి.

మనిషి వేల సంవత్సరాలుగా బంగారాన్ని ఉపయోగిస్తున్నాడు. ప్రాచీన కాలంలోనే బంగారం విలువైన లోహంగా గుర్తింపు పొందింది. అప్పట్లో నేటి మాదిరిగా కాగితపు కరెన్సీ, ప్లాస్టిక్ కార్డులు లేదా డిజిటల్ చెల్లింపులు అందుబాటులో ఉండేవి కావు. వస్తువుల మార్పిడి కోసం పశువులు, కలప వంటి వస్తువులను ఉపయోగించేవారు. అయితే, ఇలాంటి వస్తువులను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తీసుకెళ్లడం, వాటి విలువను నిర్ణయించడం కొంత కష్టంగా ఉండేది. ఈ నేపథ్యంలో బంగారం వంటి విలువైన లోహాలు వాణిజ్యానికి అనుకూలమైన సాధనాలుగా మారాయి.



కుమార్ పీవీజీ

క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దానికి చెందినవిగా భావించే బంగారు నాణేలు కూడా కనుగొనబడ్డాయి. బంగారంతో తయారుచేసిన నాణేలను వస్తువుల కొనుగోలు, అమ్మకాలలో ఉపయోగించేవారు. బంగారం విలువైనదిగా ఉండటం, దానిని తీసుకెళ్లడం సులభంగా ఉండటం, ఇతర వస్తువులతో పోలిస్తే దాని విలువను గుర్తించడం సులభం కావడం వంటి కారణాలు దాని వినియోగాన్ని పెంచాయి. కాలక్రమేణా బంగారం సంపదకు, ఆర్థిక స్థిరత్వానికి చిహ్నంగా మారింది.

ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న డబ్బు నేరుగా బంగారంతో తయారుకావడం లేదు. అయినప్పటికీ, బంగారం తన ఆర్థిక ప్రాధాన్యతను కోల్పోలేదు. దీనికి ప్రధాన కారణం బంగారం ఒక విలువైన ఆస్తిగా పరిగణించబడటం. ఆర్థిక పరిభాషలో ఆస్తి అంటే డబ్బుకు విక్రయించగలిగే విలువైన వస్తువు లేదా సంపద. భూమి, ఇళ్లు, కంపెనీల వాటాలు వంటి వాటితో పాటు బంగారం కూడా పెట్టుబడి ఆస్తిగా గుర్తింపు పొందింది. అవసరమైనప్పుడు బంగారాన్ని విక్రయించి డబ్బుగా మార్చుకోవచ్చు. అందువల్ల వ్యక్తులు మాత్రమే కాకుండా పెట్టుబడిదారులు, బ్యాంకులు, ప్రభుత్వ కేంద్ర బ్యాంకులు కూడా బంగారాన్ని కొనుగోలు చేస్తుంటాయి.

బంగారం కొనుగోలుకు ప్రధాన కారణాల్లో ఒకటి ఆర్థిక భద్రత. ప్రపంచంలో యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభాలు లేదా మార్కెట్లలో తీవ్ర ఒడిదుడుకులు ఏర్పడినప్పుడు ప్రజల్లో భవిష్యత్తుపై అనిశ్చితి పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని పెట్టుబడుల విలువ గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో చాలా మంది పెట్టుబడిదారులు బంగారాన్ని తులనాత్మకంగా భద్రమైన పెట్టుబడిగా భావిస్తారు. ఆర్థిక ప్రపంచంలో దీనిని సేఫ్ హెవెన్ (Safe Haven) అని పిలుస్తారు. అంటే సంక్షోభాలు లేదా ఆర్థిక నష్టాల భయం ఉన్నప్పుడు సంపదను కాపాడుకోవడానికి ఆశ్రయించే పెట్టుబడి అని అర్థం.

బంగారం ఒక నిర్దిష్ట దేశ ప్రభుత్వానికి లేదా ఒకే ఆర్థిక వ్యవస్థకు పూర్తిగా అనుసంధానమై ఉండదు. ఉదాహరణకు, ఒక దేశ కరెన్సీ విలువ ఆ దేశ ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు వంటి అంశాల వల్ల ప్రభావితమవుతుంది. అదే విధంగా కంపెనీల షేర్ల విలువ ఆ కంపెనీల పనితీరు, మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కానీ బంగారానికి అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్నందున, వివిధ దేశాల్లోని పెట్టుబడిదారులు దానిని విలువైన ఆస్తిగా పరిగణిస్తారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు బంగారాన్ని ప్రత్యేకమైన పెట్టుబడిగా నిలబెడుతుంది.

బంగారం ధర పెరగడానికి మరో ముఖ్యమైన కారణం దాని పరిమిత సరఫరా. బంగారం భూమి లోపల సహజంగా లభించే లోహం. దానిని గనుల నుంచి వెలికితీయడానికి సమయం, శ్రమ, సాంకేతిక పరిజ్ఞానం, భారీ పెట్టుబడులు అవసరం. కాగితపు కరెన్సీని ముద్రించినట్లుగా బంగారాన్ని అవసరమైనంత సులభంగా కొత్తగా సృష్టించడం సాధ్యం కాదు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో సాధారణ పరిస్థితుల్లో బంగారం సరఫరాను వేగంగా పెంచడం కూడా కష్టం.

ఈ పరిమిత సరఫరా బంగారం విలువను ప్రభావితం చేసే ముఖ్యమైన అంశం. మార్కెట్లో బంగారం కొనాలనుకునే వారి సంఖ్య పెరిగి, అందుబాటులో ఉన్న సరఫరా దానికి అనుగుణంగా పెరగకపోతే ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. దీనికి విరుద్ధంగా డిమాండ్ తగ్గినప్పుడు లేదా ఇతర మార్కెట్ పరిస్థితులు మారినప్పుడు ధరలు తగ్గవచ్చు. కాబట్టి బంగారం ధర ఎప్పుడూ పెరుగుతుందని చెప్పలేం. దాని ధర కూడా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మారుతుంటాయి.

2026 ప్రారంభంలో బంగారం ధరలు చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరడానికి ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిణామాలు కూడా ఒక కారణంగా నిలిచాయి. ఉక్రెయిన్‌లో యుద్ధం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, అంతర్జాతీయ వాణిజ్యంపై అమెరికా విధించిన సుంకాలు వంటి పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అనిశ్చితిని పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని దేశాల కేంద్ర బ్యాంకులు తమ నిల్వల్లో బంగారం పరిమాణాన్ని పెంచుకోవడానికి ఆసక్తి చూపాయి. కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేయడం వల్ల మార్కెట్లో డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుంది. అయితే, బంగారం ధరలను నిర్ణయించేది ఈ ఒక్క అంశమే కాదు. పెట్టుబడిదారుల కొనుగోళ్లు, వడ్డీ రేట్లు, కరెన్సీ విలువలు, మార్కెట్ అంచనాలు వంటి అనేక అంశాలు కూడా ప్రభావం చూపుతాయి.

బంగారంపై ప్రజలకు ఆసక్తి కొనసాగడానికి మరో కారణం ఆధునిక ప్రపంచంలో పెరుగుతున్న డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు. ప్రస్తుతం మన సంపదలో ఎక్కువ భాగం బ్యాంకు ఖాతాల్లోని సంఖ్యలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, డిజిటల్ ఆస్తులు వంటి రూపాల్లో ఉండవచ్చు. ఇవి సౌకర్యవంతమైనవే అయినప్పటికీ, భౌతికంగా చేతిలో పట్టుకోగలిగే సంపదకు ఉండే ప్రత్యేకమైన అనుభూతి వీటిలో ఉండదు. బంగారం మాత్రం స్పష్టంగా కనిపించే, భౌతికంగా చేతిలో ఉంచుకోగలిగే ఆస్తి. అందువల్ల కొంత మంది పెట్టుబడిదారులు ఆధునిక డిజిటల్ ప్రపంచంలో కూడా బంగారాన్ని నమ్మదగిన, సంప్రదాయ విలువ కలిగిన పెట్టుబడిగా భావిస్తారు.

అంతేకాకుండా, బంగారానికి సంబంధించిన సంప్రదాయాలు, సామాజిక విలువలు కూడా దాని డిమాండ్‌ను ప్రభావితం చేస్తాయి. భారతదేశం వంటి దేశాల్లో వివాహాలు, పండుగలు, శుభకార్యాల సమయంలో బంగారు ఆభరణాలను కొనుగోలు చేయడం సాధారణం. అనేక కుటుంబాలు బంగారాన్ని కేవలం అలంకరణ వస్తువుగా కాకుండా కుటుంబ సంపదలో ఒక భాగంగా చూస్తాయి. అవసరమైనప్పుడు దానిని విక్రయించవచ్చనే లేదా తాకట్టు పెట్టి రుణం పొందవచ్చనే ఆలోచన కూడా బంగారం కొనుగోలును ప్రోత్సహిస్తుంది. అయితే, ఆభరణాలను కొనుగోలు చేసేటప్పుడు తయారీ ఛార్జీలు, పన్నులు, తిరిగి విక్రయించే సమయంలో లభించే ధర వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

భవిష్యత్తులో బంగారం ధరలు ఎలా ఉంటాయనే ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం చెప్పడం సాధ్యం కాదు. ఆర్థిక అనిశ్చితి కొనసాగినప్పుడు బంగారానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. అందువల్ల దీర్ఘకాలంలో బంగారం పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందని కొందరు నిపుణులు భావిస్తారు. అయితే, బంగారం ధరలు కూడా తగ్గవచ్చు. బంగారంలో పెట్టుబడి పెట్టిన ప్రతిసారీ లాభం వస్తుందని హామీ లేదు. కాబట్టి పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేటప్పుడు వ్యక్తిగత ఆర్థిక అవసరాలు, పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్‌ను భరించే సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

మొత్తంగా చూస్తే, బంగారానికి వేల సంవత్సరాల చరిత్ర, పరిమిత సహజ సరఫరా, అంతర్జాతీయ గుర్తింపు, ఆర్థిక అనిశ్చితి సమయంలో పెట్టుబడిదారులను ఆకర్షించే లక్షణాలు ఉన్నాయి. సంప్రదాయ విలువలు, భౌతిక సంపదపై నమ్మకం కూడా దాని ప్రాధాన్యతను కొనసాగిస్తున్నాయి. అందుకే డబ్బు రూపాలు మారుతున్నా, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా, బంగారం తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటోంది. ప్రజలు బంగారాన్ని కొనుగోలు చేయడానికి కారణం కేవలం దాని అందం మాత్రమే కాదు; సంపదను నిల్వ చేసుకోవాలనే ఆకాంక్ష, భవిష్యత్తుపై భద్రతా భావన, చారిత్రక నమ్మకం కూడా అందులో భాగంగా ఉన్నాయి.

రాహుల్ ప్రభంజనం, ప్రజాస్వామ్యానికి కొత్త ఆశ

ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించే గొంతుక బలపడటం ప్రజలకు భరోసా, పాలకులకు హెచ్చరిక. ఢిల్లీ వీధుల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలో సాగుతున్న పోరాటాలు ప్రతిపక్ష రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ముఖ్యంగా యువతలో ఆయన పట్ల పెరుగుతున్న ఆసక్తి కాంగ్రెస్‌కే కాదు, దేశ ప్రజాస్వామ్యానికీ ఒక ఆశాకిరణం. అయితే ఈ ప్రభంజనం ఎంత బలంగా ఉందో నిర్ణయించేది నినాదాలు కాదు, ప్రజల సమస్యలపై చూపే నిబద్ధత, సాధించే ఫలితాలే.

రాజీవ్ గాంధీ తర్వాత గాంధీ కుటుంబం నుంచి మరో ప్రజాకర్షక నాయకుడు ఎదగడం కష్టమనే అంచనాలువుండేవి. కానీ భారత్ జోడో యాత్ర, న్యాయ్ యాత్రల ద్వారా రాహుల్ గాంధీ ప్రజల మధ్యకు వెళ్లారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలను నిరంతరం ప్రస్తావించారు. విమర్శలు, రాజకీయ ఎదురుదెబ్బలు ఎదురైనా ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నాన్ని కొనసాగించడం ఆయన నాయకత్వంలో వచ్చిన మార్పునకు నిదర్శనం. ఈ క్రమంలో ఆయనను ఒకప్పుడు తేలికగా తీసుకున్నవారూ ఇప్పుడు రాజకీయంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యువతలో కొత్త ఆకర్షణ. నేటి Gen Z యువతకు నాయకుల వయసు, వారసత్వం కంటే తమ భవిష్యత్తుపై వారికి ఉన్న అవగాహన ముఖ్యం. ఉద్యోగాలు, నైపుణ్యాలు, పేపర్ లీకులు, విద్యావకాశాలు, జీవన వ్యయం, డిజిటల్ స్వేచ్ఛ వంటి సమస్యలపై స్పష్టమైన సమాధానాలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ యువతతో మమేకమవుతూ వారి సమస్యలను జాతీయ చర్చలోకి తీసుకురావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీలో అనుభవజ్ఞులైన నాయకులున్నప్పటికీ, యువత ఆకాంక్షలకు అనుగుణంగా నాయకత్వం స్పందిస్తోందా అన్న ప్రశ్న ఎదురవుతోంది. వయసు ఒక్కటే సామర్థ్యానికి కొలమానం కాకపోయినా, కొత్త తరంతో అనుసంధానం కావడం ప్రతి పార్టీకి అవసరం. యువతలో రాహుల్ పట్ల కనిపిస్తున్న ఆసక్తిని ప్రజా మద్దతుగా మలచుకోవడం ఆయన ముందున్న సవాలు.


ఓటు హక్కుపై సందేహాలకు సమాధానాలేవీ? ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR)పై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు కీలకమైనవి. అర్హులైన పౌరుల పేర్లు తొలగిపోతే వారి ఓటు హక్కుకే భంగం కలుగుతుంది. అదే సమయంలో అనర్హుల పేర్ల తొలగింపును తప్పుగా చూడలేం. కాబట్టి ప్రతి తొలగింపునకూ పారదర్శకమైన కారణాలు, అభ్యంతరాల పరిష్కారం, అప్పీళ్లకు తగిన అవకాశం ఉండాలి. ఈ అంశంపై రాహుల్ గాంధీ ప్రశ్నలు లేవనెత్తడం, న్యాయపరమైన పరిశీలన కోరడం ప్రజాస్వామ్య జవాబుదారీతనాన్ని బలోపేతం చేయగలవు. అయితే ఓట్ల చోరీ వంటి ఆరోపణలు నిర్ధారించాలంటే ఆధారాలు, స్వతంత్ర విచారణ అవసరం. ఎన్నికల సంఘం కూడా అనుమానాలను నివృత్తి చేసే బాధ్యత నుంచి తప్పించుకోరాదు.

ప్రశ్నించాలి, పరిష్కారాలూ చూపాలి. ప్రతిపక్షం నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు. ప్రభుత్వాన్ని నిలదీయడం దాని బాధ్యత. అదే సమయంలో నిరసనలు శాంతియుతంగా సాగాలి, న్యాయవ్యవస్థ ప్రక్రియలను గౌరవించాలి. రాహుల్ గాంధీ తన పోరాటాన్ని విశ్వసనీయమైన విధాన ప్రత్యామ్నాయాలతో అనుసంధానిస్తే, అది కాంగ్రెస్ పునరుజ్జీవనానికే కాకుండా ప్రజాస్వామ్యానికి కూడా మేలు చేస్తుంది.

రాహుల్ ఎదుగుదలను కేవలం రాజకీయ వ్యూహంగా కొట్టిపారేయలేం, ఆయనను ప్రజాస్వామ్య రక్షకుడిగా ముందుగానే ప్రకటించడమూ సరికాదు. కానీ అధికారాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష గొంతుకకు ప్రజల్లో ఆదరణ పెరగడం మాత్రం స్వాగతించాల్సిన పరిణామం. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రభుత్వం ఎంత అవసరమో, బలమైన ప్రతిపక్షమూ అంతే అవసరం. అధికారాన్ని గెలవడం నాయకుడి విజయం కావచ్చు, ప్రజల విశ్వాసాన్ని గెలవడమే నాయకత్వం

-కొలను వెంకటేశ్వర రెడ్డి





చెడు కొలెస్ట్రాల్ (LDL) ఇలా
తగ్గించుకోండి

ఆహారంలో తీసుకోవాల్సినవి

ఆకుకూరలు: పాలకూర, బచ్చలికూర వంటి ఆకుకూరలను రోజూ తీసుకోవాలి.

తృణధాన్యాలు: ఓట్స్, బార్లీ, జొన్నలు, సజ్జలు, రాగులు వంటి పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ధాన్యాలు తినాలి.

వెల్లుల్లి, మెంతులు: రోజూ ఒక వెల్లుల్లి రెబ్బ తినడం వల్ల కొలెస్ట్రాల్ దాదాపు 9% వరకు తగ్గుతుంది. మెంతులను నానబెట్టి ఆ నీటిని లేదా మెంతులను ఆహారంలో చేర్చుకోవాలి.

ఆరోగ్యకరమైన కొవ్వులు: ఆలివ్ ఆయిల్, అవకాడో, బాదం, వాల్‌నట్స్, అలాగే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండే చేపలు తీసుకోవాలి.

గింజలు: చియా సీడ్స్, అవిసె గింజలు (Flaxseeds) డైట్‌లో చేర్చుకోవాలి.

జీవనశైలిలో మార్పులు

వ్యాయామం: ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు (వారానికి 150 నిమిషాలు) బ్రిస్క్ వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయాలి.

బరువు నియంత్రణ: శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

దూరంగా ఉండాల్సినవి: ట్రాన్స్ ఫ్యాట్స్, జంక్ ఫుడ్, ధూమపానం, ఆల్కహాల్ పూర్తిగా మానేయాలి.

ఒత్తిడి తగ్గించుకోవడం: యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలి.

సహజ పద్ధతులతో పాటు మీ కొలెస్ట్రాల్ స్థాయిలను బట్టి డాక్టర్ సలహాతో తగిన పరీక్షలు చేయించుకోవడం మంచిది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 18.10.2026
www.mudranews.in | @mudranews

డీహైడ్రేషన్ : వాంతులు, విరేచనాలు ఉంటే ORS తీసుకోండి



వాంతులు, విరేచనాల వల్ల శరీరంలో నీరు, లవణాలు తగ్గిపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఓఆర్ఎస్ (ORS) ద్రావణం ఉపయోగపడుతుంది. ప్యాకెట్‌పై సూచించిన పరిమాణంలోనే సురక్షితమైన నీటితో కలిపి తీసుకోవాలి. తీవ్రమైన లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సహాయం పొందాలి.

గోదావరి, కావేరీ లింకుతో తెలంగాణ నీటి హక్కులకు ముప్పు

రేవంత్ రెడ్డి మౌనం వీడాలి
హరీశ్ రావు



ముద్ర, హైదరాబాద్: గోదావరి–కావేరీ నదుల అనుసంధానం పేరుతో తెలంగాణ నీటి హక్కులకు నష్టం జరిగే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. నవంబర్ 3న ఢిల్లీలో జరగనున్న జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశం ఎజెండాలో ఈ ప్రాజెక్టును చేర్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనం వీడి రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలని డిమాండ్ చేశారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జునసాగర్, సోమశిల మీదుగా కావేరీకి నీటిని తరలించే ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారని విమర్శించారు. గతంలో పోలవరం–బనకచర్ల, ఆ తర్వాత నల్లమలసాగర్ పేర్లతో వచ్చిన ప్రతిపాదనలకు బదులుగా ఇప్పుడు గోదావరి–కావేరీ అనుసంధానం పేరుతో తెలంగాణకు నష్టం కలిగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.గోదావరి–కావేరీ అనుసంధానానికి ఇచ్చంపల్లి లేదా సమ్మక్క సాగర్ నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను పక్కనపెట్టి, పోలవరం నుంచి బొల్లపల్లి రిజర్వాయర్ మీదుగా నీటిని తీసుకెళ్లాలని చంద్రబాబు కోరుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా అనుసంధానం జరిగితే తెలంగాణకు సాగునీటి ప్రయోజనాలు కలుగుతాయని, ప్రతిపాదనను మార్చడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు.ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీల జలాలను మళ్లించే లక్ష్యంతో రూపొందించిన ప్రాజెక్టులో తెలంగాణకు 43 టీఎంసీలు, ఏపీకి 44 టీఎంసీలు, తమిళనాడుకు 42.5 టీఎంసీలు, కర్ణాటకకు 16 టీఎంసీలు, పుదుచ్చేరికి 2.5 టీఎంసీలు కేటాయించే ప్రతిపాదన ఉందని వివరించారు. ఈ నీటి పంపిణీ, అనుసంధాన మార్గంలో మార్పులు తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీయకూడదని స్పష్టం చేశారు.తెలంగాణకు 968 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతులు ఇవ్వాలని, అనుసంధానం ద్వారా తరలించే నీటిలో 50 శాతం రాష్ట్రానికి కేటాయించాలని, తెలంగాణకు చెందిన నీటిని ఒక్క చుక్క కూడా మళ్లించకుండా చూడాలని గతంలోనే తమ పార్టీ స్పష్టం చేసిందన్నారు. రాష్ట్రంలో 139 టీఎంసీలకు సంబంధించిన ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, వార్ధా, సమ్మక్క తదితర ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని ఆరోపించారు.సాగునీటి నిర్వహణలోనూ ప్రభుత్వ వైఫల్యంరాష్ట్రంలో కరువుకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్‌రావు విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టులో పది మోటార్లకు బదులుగా మూడు మోటార్లే ఎందుకు నడిపారని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, కన్నెపల్లి పంపుల వద్ద కూడా పూర్తిస్థాయిలో నీటిని ఎత్తిపోసే చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే చెరువులు, చెక్‌డ్యామ్‌లు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగేవని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావంపై తొమ్మిది నెలలుగా హెచ్చరిస్తున్నా ప్రభుత్వం స్పందించలేదని, ఇప్పుడు కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో విఫలమైందని విమర్శించారు. పంపుల వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లి నీటి ఎత్తిపోతలపై వాస్తవాలను పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలితెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గోదావరి–కావేరీ అనుసంధాన ప్రతిపాదనలో తెలంగాణకు నష్టం కలిగించే మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రజలు, బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోవని హెచ్చరించారు.ఈ సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమర పోలీసుల స్ఫూర్తితో.. 157 మంది రక్తదానం

గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరం



ముద్ర, హైదరాబాద్ : పోలీసు స్మారక వారోత్సవాల సందర్భంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 157 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో కమాండోలు, సీనియర్ అధికారులు, ప్రొబేషనరీ డీఎస్పీలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ప్రజాసేవతో పాటు ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలోనూ ముందుంటామని పోలీసులు ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. గ్రేహౌండ్స్‌లో మూడు వారాల పాటు 'జంగిల్ ఆపరేషన్స్ అండ్ సర్వైవల్ టాక్టిక్స్'లో శిక్షణ పొందుతున్న 30 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు స్వేతం రక్తదానం చేశారు. తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీ (ఆపరేషన్స్) డాక్టర్ అనిల్‌కుమార్ (ఐపీఎస్) కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్లు ఎం.డి. అష్పాక్, ఎ. వెంకటేశ్వర్లు, పి.వి. నారాయణస్వామి, స్క్వాడ్రన్ కమాండర్లు బి. శంకరయ్య, జి. రాజు, ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి.హెచ్. రఘునందన్‌రావు, గ్రేహౌండ్స్ వైద్యాధికారులు డాక్టర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పి. మంజురెడ్డి, ఆక్టోపస్ వైద్యాధికారి డాక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు.

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్ఠాత్మక సదస్సు
పారిశ్రామిక దిగ్గజాలు, అంతర్జాతీయ ప్రతినిధులను ఆహ్వానించాలి
అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు

ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 17: డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో సమ్మిట్ ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల నిపుణులు సదస్సులో పాల్గొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ముందస్తుగా ఈ నెల 24న హైదరాబాద్‌లో, 29న న్యూఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ఈ కార్యక్రమాలకు ఆహ్వానాలు పంపించినట్లు అధికారులు ఆయనకు వివరించారు. ముఖ్యంగా ఏరోస్పేస్, అంతరిక్షం, రక్షణ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ఇతర కీలక భాగస్వాములను ఆహ్వానించాలని సంజయ్ జాజు ఆదేశించారు.వివిధ దేశాల రాయబారులతో పాటు ఫిక్కీ, అసోచామ్, సీఐఐ వంటి ప్రముఖ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులను సదస్సుకు ఆహ్వానించాలని సూచించారు. ఆహ్వానాలు పంపించడంతోనే సరిపెట్టకుండా ప్రముఖుల హాజరును నిర్ధారించుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.హైదరాబాద్, న్యూఢిల్లీలలో నిర్వహించే ముందస్తు కార్యక్రమాలు తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాల సాధనకు దోహదపడేలా ఉండాలన్నారు. పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులు, వివిధ రంగాల నిపుణుల మధ్య అర్థవంతమైన చర్చలు జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతి అధికారి సమ్మిట్ విజయాన్ని తమ బాధ్యతగా భావించి సమిష్టిగా కృషి చేయాలని సంజయ్ జాజు ఆదేశించారు.

డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా బైక్ ర్యాలీ



ముద్ర, హైదరాబాద్:దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చి, యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించే రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమంలో భాగంగా, సీఆర్‌పీఎఫ్ సమన్వయంతో ఈ ర్యాలీ చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన బైక్ రైడర్లు ఇందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ బారినపడి యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని, పోలీసు శాఖ సమన్వయంతో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ జాతీయ సమైక్యతే అందరి లక్ష్యమని పేర్కొన్నారు. ఐక్యత, సామాజిక బాధ్యతను చాటడంతోపాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. 2029 డిసెంబర్ నాటికి దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చే లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.బైక్ రైడర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని డీజీపీ సూచించారు. వివిధ ప్రాంతాల మీదుగా సాగే ఈ ర్యాలీ అక్టోబర్ 30 నాటికి గుజరాత్‌లోని కెవడియాకు చేరుకోనుంది. అక్టోబర్ 31న అక్కడ నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమంలో రైడర్లు పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ సీపీ సజ్జనార్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి విక్రమ్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ విశాల్, పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి నవరాత్రి వేడుకలు







ముద్ర, కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రానా ప్రతాప్ నగరంలో జరుగుతున్న శ్రీదేవి నవరాత్రి వేడుకల్లో జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు కొల్లా శంకర్, ప్రసాద్ నాయుడు, వెంకట్, రామ్ గౌడ్, కిషోర్, కిరణ్, సాయి, పృథ్వీ, రోహిత్, కన్నా, రాహుల్, సందీప్, మోహన్, వంశీ తదితర కార్యకర్తలు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూసాపేట్‌లో..

దుర్గామాత మండపాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. తూమ్ శశాంక్, జిల్లా మనోజ్, శ్రవణ్ గుప్తాల ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

హెచ్.ఏ.ఎల్‌లో ..

హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్.ఏ.ఎల్) పరిశ్రమ ఆవరణలోని ఐ.ఎన్.టి.యు.సి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయుధ పూజ, దుర్గామాత ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐ.ఎన్.టి.యు.సి ప్రధాన కార్యదర్శి, గుర్తింపు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్మ నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. హెచ్.ఏ.డబ్ల్యూ యూనియన్ అధ్యక్షుడు, కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కె. వెంకటాద్రి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రరావు నాయక్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోఆర్డినేషన్ సెక్రటరీ సురేష్, నాయకులు బాబీ, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, నీలవేణి, సుధీర్, శశిధర్, రామారావు, వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే నిజమైన సంపద

బండి రమేశ్



ముద్ర, కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో పాస్టర్ క్రిస్టఫర్ మరియు సులోచన ఆధ్వర్యంలో "హెల్త్ ఈజ్ ఏ బ్లెస్సింగ్" నినాదంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజన్నతో పాటు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మరియు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే సమాజానికి నిజమైన సంపద అని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. నేటి బిజీ జీవితంలో అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఇలాంటి వైద్య పరీక్షలు ఎంతో అవసరమని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొంటూ, నిర్వాహకులు పాస్టర్ క్రిస్టఫర్, సులోచనలను అభినందించారు.ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, లక్ష్మయ్య, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, మధు మోహన్, జిల్లా శివ, జావిద్, రేణుక, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ముద్ర, కూకట్‌పల్లి: మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, కూకట్‌పల్లిలోని 6th ఫేజ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భారతీయ జనతా పార్టీ 251వ డివిజన్ వసంత్ నగర్ అధ్యక్షురాలు ఎన్. రత్నకుమారి ఆధ్వర్యంలో, సాయి కృష్ణ రాజు, శంకర్ రాజు. సహకారంతో ఈ ప్రక్రియ నిర్వహించబడుతోంది.ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ, పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.చివరి తేదీ: నవంబర్ 5వ తేదీ వరకుసమయం: ప్రతిరోజూ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు , 6th ఫేజ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కూకట్‌పల్లిఈ కార్యక్రమ నిర్వహణలో అసోసియేషన్ సభ్యులు శివశంకర్ రెడ్డి, సుబ్బరాజు, రమణ రావు, సత్యనారాయణ, గాయత్రి, భానుమతి తో పాటు ఎమ్మెల్సీ 251వ డివిజన్ కన్వీనర్ గురు ప్రసాద్, సాయి కృష్ణ రాజు, శంకర్ రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమానికి సహకరించిన అసోసియేషన్ సభ్యులకు, నాయకులకు నాయకత్వం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

గల్ఫ్‌లో మిట్టపల్లి బతుకమ్మ పాట ఆవిష్కరణ

దుబాయ్‌లో వేడుకలు.. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టిన గీతం



ముద్ర, హైదరాబాద్:"ఎడారిలో తంగేడు వనమే మొలిసేనో" అంటూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పాట దుబాయ్ లో ఘనంగా ఆవిష్కృతమైంది. అక్షర గోల్డ్ అండ్ డైమండ్స్ గ్రూప్ చైర్మన్ కోట కుమార్ (కేకే) నిర్మించిన ఈ పాటకు ప్రముఖ తెలంగాణ ప్రజాకవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ సాహిత్యం అందించగా, ప్రముఖ గాయని మంగ్లీ ఆలపించారు. మదీన్ ఎస్కే నేపథ్య సంగీతం సమకూర్చారు.గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన తెలంగాణ కార్మికుల భావోద్వేగాలు, బతుకమ్మ పండుగను స్వగ్రామంలో కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవాలనే ఆకాంక్షను ఈ గీతం ఆవిష్కరించింది. పండుగకు దూరంగా ఉన్న తెలంగాణ ఆడబిడ్డలు, అన్నదమ్ములకు స్వగ్రామ జ్ఞాపకాలను గుర్తుచేసేలా పాటను రూపొందించారు.హిందూ–ముస్లిం సోదరభావాన్ని చాటుతూ, తెలంగాణ సంప్రదాయాల మాధుర్యాన్ని గల్ఫ్ సంస్కృతితో మేళవించారు. గోల్కొండ కోట నుంచి బుర్జ్ ఖలీఫా వరకు ఏడు దేశాల అనుబంధాన్ని ఏడు రంగుల బతుకమ్మ స్ఫూర్తితో ప్రతిబింబించారు.మిట్టపల్లి స్టూడియో రూపొందించిన ఈ పాటను తెలంగాణతో పాటు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలకు కోట కుమార్ అంకితం చేశారు. తెలంగాణ నుంచి వచ్చిన డప్పు, ఒగ్గుడోలు బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుబాయ్, అబుదాబి నుంచి వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్పార్క్ మీడియా అరుణ్, సుతారి సత్యం, మల్లేష్ గౌడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకల పంపిణీ



ముద్ర, కాప్రా: బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా బట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలను పంపిణీ చేసి కేక్ కట్ చేసి సతీష్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, బొంతు శ్రీదేవి యాదవ్, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పావని మణిపాల్ రెడ్డి, ప్రభుదాస్, పొన్నాల దేవేందర్ రెడ్డి, పలువురు స్థానిక బిఆర్ఎస్ కాంగ్రెస్, బిజెపి, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ముద్ర, కాప్రా : నాచారం డివిజన్ 21 పరిధిలో చేపట్టనున్న 2 కోట్ల 11 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శనివారం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు.దుర్గానగర్, బాబా నగర్ బైలైన్ రోడ్లు – రూ. 44.90 లక్షల నిధులతో,హనుమాన్ నగర్, బాబా నగర్ కాలనీ (ఎస్ ఫ్యాక్టరీ) రూ. 42.80 లక్షల నిధులతో రామిరెడ్డి నగర్ కాలనీ – రూ. 44.30 లక్షల నిధులతో చేపడుతున్న రోడ్డు పనులను ప్రారంభించారు.అలాగే కార్తికేయ నగర్ కాలనీ లో రూ. 44.90 లక్షల నిధులతో.గాంధీ నగర్ కాలనీ – రూ. 34 లక్షల నిధులతో వివిధ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో డి ఈ సాయి పృథ్వి, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు

రంగారెడ్డి డీసీసీ కార్యదర్శి జన్మదిన వేడుకలు



ముద్ర, కూకట్‌పల్లి/శేరిలింగంపల్లి: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యదర్శి శిరీష సత్తూరు జన్మదిన వేడుకలు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జరిగాయి.ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. తులసి వనంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకట్రాంరెడ్డి మృతి తీరని లోటు



ముద్ర, చేవెళ్ల: శంకర్ పల్లి పురపాలిక మాజీ వైస్ చైర్మన్ బానూరి వెంకట్రాంరెడ్డి మృతి తీరని లోటు అని ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన వెంకట్రాంరెడ్డి కుటుంబసభ్యులను శంకర్ పల్లి లోని నివాసంలో పరామర్శించారు. ఆయన భార్య ప్రభావతి, కుమారులను ఓదార్చారు. శంకర్ పల్లి అభివృద్ధికి ఆయన చేసిన సేవలు గొప్పవని గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 18.10.2026
www.mudranews.in | @mudranews

డీహైడ్రేషన్ : డీహైడ్రేషన్ లక్షణాలను గుర్తించండి

నోరు పాడిబారడం, మూత్రం తక్కువగా రావడం, మూత్రం ముదురు పసుపు రంగులో ఉండటం, తల తిరగడం వంటివి డీహైడ్రేషన్‌కు సంకేతాలు కావచ్చు. తీవ్రమైన నీరసం, గందరగోళం, మూర్ఛ లేదా స్పృహ తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి.



సాగునీటి కోసం ధర్నా రాస్తారోకో



ముద్ర, కరీంనగర్ : వరి పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ శంకరపట్నంలో జాతీయ రహదారిపై శనివారం గ్రామాల రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. నాయకులు రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, కాలువల ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై అరగంట పాటు చేపట్టిన ధర్నా, రాస్తారోకోతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచుల పోరం జిల్లా అధ్యక్షుడు ఆకుబత్తిని విజయ్ కుమార్, నాయకులు రవి యాదవ్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కోల్‌కతాలో తీవ్ర విషాదం..

దుర్గా మండపంలో తొక్కిసలాట, 17 మంది మృతి?



ముద్ర, కోల్ కతా : పండగ వేళ పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాజధాని కోల్‌కతాలోని ఓ దుర్గా పూజా మండపం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 17 మంది మరణించినట్లు తెలుస్తోంది. 30 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. శనివారం ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బాగన్ సార్వజనిన్ దుర్గా పూజ పండల్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమాచారం అందుకున్న సీఎం సువేందు అధికారి, రాష్ట్ర సీఎస్ మనోజ్ అగర్వాల్ పరిస్థితిని సమీక్షించేందుకు కలకత్తా మెడికల్ కాలేజీకి చేరుకున్నారు. ఈ ఘటనపై మాజీ సీఎం మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని, బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ఘటన సమయంలో మండపం వద్ద ఒక్కసారిగా రద్దీ పెరగడంతో ఈ ఘటన జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. క్షతగాత్రుల్లో చాలా మందిని బైకులపై ఆస్పత్రులకు తరలించారు. మండపంలోకి ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు చాలా ఇరుకుగా ఉండటంతోనే ప్రమాద తీవ్రత పెరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

ఇంజినీరింగ్ కళాశాల దాండియా వేడుకల్లో విషాదం..

విద్యార్థిని మృతి



ముద్ర, నాదర్‌గుల్: రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రమాదం జరిగింది. కాలేజీలో నిర్వహించిన దాండియా ఈవెంట్‌లో విషాదం చోటుచేసుకుంది. లైటింగ్ సిస్టమ్ ఒక్కసారిగా కూలిపోయి.. మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఓ విద్యార్థిని మృతి చెందగా.. 25 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

విద్యార్థిని మృతి చెందిన ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారు.

జేబీఎస్, ఎంజీబీఎస్‌లో పెరిగిన దసరా పండగ రద్దీ



ముద్ర, హైదరాబాద్: దసరా పండగ నేపథ్యంలో పట్నం పల్లెబాట పట్టింది. పండగ రద్దీతో హైదరాబాద్ నగరంలోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. జేబీఎస్, ఎంజీబీఎస్‌లో రద్దీ భారీగా పెరిగింది. ఇవాళ, రేపు భారీగా ప్రయాణాలు ఉంటాయని ఆర్టీసీ అంచనా వేస్తోంది. అందుకు తగ్గట్లు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఆర్టీసీ 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు నగర శివార్ల నుంచి కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి కూడా బస్సులు నడుస్తున్నాయి. స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు మహాలక్ష్మి ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

కరీంనగర్‌ను కమ్మేస్తున్న చెత్త పొగలు!

4.50 లక్షల టన్నుల చెత్తతో డంపింగ్‌యార్డు విలవిల
బయోమైనింగ్‌లో నిర్లక్ష్యం.. ఏళ్లుగా పేరుకుపోతున్న వ్యర్థాలు
ఉక్కిరిబిక్కిరవుతున్న కాలనీవాసులు.. మాస్కులతో మహిళల నిరసన
శాశ్వత పరిష్కారంపై అధికారుల కసరత్తు

ముద్ర, కరీంనగర్: కరీంనగర్ నగరంలోని డంపింగ్‌యార్డు ప్రమాదకరంగా మారింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తకు మంటలు అంటుకోవడంతో దట్టమైన పొగ, దుర్వాసన సమీప కాలనీలను కమ్మేస్తున్నాయి. దీంతో అలకాపురి, కోతిరాంపూర్ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాస్కులు ధరించి బతుకమ్మ ఆడుతూ మహిళలు నిరసన వ్యక్తం చేయడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. నగరంలో రోజూ 150 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, డంపింగ్‌యార్డులో ఇప్పటికే 4.50 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకుపోయాయి. గతంలో బయోమైనింగ్ కోసం కోట్లాది రూపాయలు కేటాయించినా చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించే విధానం కూడా అమలుకు నోచుకోలేదు. బయోగ్యాస్, కంపోస్టు తయారీ యూనిట్లు సైతం ప్రయోగాత్మక దశకే పరిమితమయ్యాయి.డంపింగ్‌యార్డును పూర్తిగా తొలగించడంతోపాటు, కొత్త ప్రదేశంలో చెత్తను శుద్ధి చేసే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. అయితే, పొగ, దుర్వాసన నుంచి తమకు ఎప్పుడు విముక్తి లభిస్తుందోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.



రాజకీయంగా ఎదగడం అంత ఆషామాషీ కాదు

- పొన్నం

ముద్ర, పటాన్‌చెరు: ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయంగా ఎదగడం అంత సులభం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగామలో గౌడ విద్యార్థుల నూతన వసతిగృహ భవనాన్ని శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు కులాలు, సంఘాలు, వ్యవస్థల నుంచి వచ్చే భిన్నాభిప్రాయాలను అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కోకాపేటలో గౌడ సంఘం భవన నిర్మాణానికి కమిటీ ఏర్పాటు చేస్తే, పనులు ప్రారంభించేందుకు సహకరిస్తామని తెలిపారు. విద్యార్థుల వసతిగృహాలు, దేవాలయాల వద్ద సత్రాల నిర్మాణానికి ప్రభుత్వం తరఫున కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ..

సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా విజయ్ దేవరకొండ దంపతులు



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక, పూల పండుగ బతుకమ్మ ముగింపు వేడుకలకు హైదరాబాద్ మహానగరం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. సద్దుల బతుకమ్మ సంబరాల కోసం చారిత్రక ట్యాంక్‌బండ్ తీరం అద్భుత శోభను సంతరించుకోగా, ఈసారి వేడుకల్లో సరికొత్త గ్లామర్, అంతకుమించిన క్రేజ్ తోడవ్వనుంది. టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఇద్దరూ కలిసి ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుండటం ఇప్పుడు భాగ్యనగరంలో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ఆధునిక ఆకర్షణను జోడిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బతుకమ్మ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. నేడు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో జరగనున్న ఈ వేడుకల్లో సినీ తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పాల్గొని సందడి చేయనున్నారు. వెండితెరపైనే కాకుండా బయట కూడా విశేషమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ హిట్ కాంబినేషన్, సంప్రదాయ పూల పండుగ వేదికపై ప్రత్యక్షం కానుండటంతో అభిమానుల్లో, నగర పౌరుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. సినిమా తారల రాకతో పాటు వేడుకలను మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. హుస్సేన్‌సాగర్ అలల సాక్షిగా రాత్రి వేళ ఆకాశాన్ని మిరుమిట్లు గొలిపేలా ప్రత్యేక లేజర్ షోను ఏర్పాటు చేశారు. మరోవైపు తెలంగాణ మట్టి వాసనను, పల్లె జీవన సౌందర్యాన్ని చాటిచెప్పేలా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 700 మంది జానపద కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో కదం తొక్కనున్నారు. రంగురంగుల పూల గోపురాలతో తరలివచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సర్వసన్నద్ధమయ్యారు. ఒకవైపు సబ్బండ వర్ణాల పూల సంబరం, మరోవైపు సినీ తారల తళుకులు, ఇంకోవైపు లేజర్ వెలుగుల జిలుగులతో రేపు సాయంత్రం ట్యాంక్‌బండ్ సరికొత్త ఉత్సాహంతో ఊగిపోనుంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు, నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్నీ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేసిందని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై శుక్రవారం తెలంగాణభవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన భారాస ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కేటీఆర్ సమీక్ష సమావేశం నిర్వహించి నేతలకు దిశానిర్దేశం చేశారు.

కుప్పకూలిన సహకార వ్యవస్థ: కేటీఆర్

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార వ్యవస్థ కుప్పకూలిందని కేటీఆర్ విమర్శించారు. కొండూరు రవీందర్‌రావు, నల్లవెల్లి అశోక్ నేతృత్వంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధుల బృందంతో



శుక్రవారం కేటీఆర్‌తో సమావేశమైంది. రాష్ట్రంలోని సహకార సంఘాలు, సహకార బ్యాంకులకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సంఘాల ప్రతినిధులు కేటీఆర్‌ను కోరారు. ఈ అంశంపై తమ పార్టీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

'స్టార్టప్ వ్యవస్థకు రుటూర్ మరింతగా తోడ్పడాలి'

వరంగల్ కేంద్రంగా రూపుదిద్దుకున్న స్వదేశీ మొబిలిటీ ప్లాట్‌ఫామ్ 'రుటూర్'ను కేటీఆర్ శుక్రవారం తెలంగాణభవన్‌లో ప్రారంభించారు. సాంకేతికత, ఆవిష్కరణలతో నిత్య ప్రయాణాలను మరింత మెరుగుపరచడం, ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్లాట్‌ఫామ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అశోక్ స్థాపించిన రుటూర్ సంస్థలో నిఖిల్ సీఈఓగా, క్రాంతి సీఓగా, అక్షయ్ సీఎఫ్ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రుటూర్ బృందానికి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మొబిలిటీ రంగంలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టడంతో పాటు.. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ వ్యవస్థకు రుటూర్ మరింతగా తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు.

అభిజిత్ దీపేకు విడుదల..

సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఇంకా జైలులో ఎందుకు?
సీజేపీ చీఫ్ అభిజిత్ దీపేకు షరతులతో కూడిన బెయిల్..
అదుపులోకి తీసుకున్న కొన్ని గంటల్లోనే బయటకు..
సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు ఇంకా జైలులోనే..
ఇంకా జైలులో ఉండటానికి కారణాలు ఇవే..



ముద్ర, న్యూఢిల్లీ : కాక్రోచ్ జనతా పార్టీ(CJP) చీఫ్ అభిజిత్ దీపేకను పోలీసులు శనివారం విడుదల చేశారు. ఢిల్లీ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో రిలీజ్ అయ్యారు. శుక్రవారం ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్‌లో తిరంగా మార్చ్ కోసం వెళ్తున్న దీపేకను అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఆయన ''పీస్ బాండ్''పై సంతకం చేయడంతో విడుదలయ్యారు.

దాస్, రాంకాల జైలులోనే ఎందుకు..?

ఇదిలా ఉంటే, అభిజిత్ దీపేకు అరెస్ట్ అయిన కొన్ని గంటలకే విడుదలైతే, సీజేపీ కో కన్వీనర్లు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లో ఇంకా జైలులోనే ఉన్నారు. దీనికి కారణం వీరు వేర్వేరు సందర్భాల్లో అరెస్ట్ కావడమే అని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అభిజిత్ దీపేకు తిరంగా మార్చ్‌కు పిలుపునిచ్చిన సెంట్రల్ పార్క్‌కు చేరుకోకముందే పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

కానీ అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లు ఆంక్షలు ఉన్నప్పటికీ దొంగచాటున జంతర్ మంతర్ చేసుకున్నారు. జంతర్ మంతర్ వద్ద వీరిద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మరో సీజేపీ సభ్యుడు అజింక్య షిండేను కూడా అక్టోబర్ 13న పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడం, నిబంధనల్ని ఉల్లంఘించడం, అక్టోబర్ 10న జంతర్ మంతర్ నిరసన సమయంలో బాండ్ నిబంధనల్ని ఉల్లంఘించడం కారణంగా వీరికి కోర్టు 5 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. షిండేకు వ్యక్తిగత బాండ్, పూచీకత్తు సమర్పించే షరతుతో ఆరు నెలల పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోనని హామీ తీసుకుని విడుదల చేశారు.


ఏ చట్టాల కింద కేసులు నమోదు..?

దీపేకు, దాస్, రాంకాలపై భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (BNSS)లోని సెక్షన్లు 126, 170 కింద చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సెక్షన్ 170 ప్రకారం, గుర్తించదగిన నేరాన్ని నివారించేందుకు పోలీసులు ముందస్తు అరెస్టు చేయవచ్చు. సెక్షన్ 126 ప్రకారం, శాంతిభద్రతలను కాపాడేందుకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ బాండ్ సమర్పించాలని ఆదేశించవచ్చు. అక్టోబర్ 10న ఢిల్లీలో నిరసన సందర్భంగా ముగ్గురు కూడా శాంతిభద్రలకు విఘాతం కలిగించమని ఏడాది కాలానికి రూ. 50,000 బాండ్‌పై సంతకం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 18.10.2026
www.mudranews.in | @mudranews


డీహైడ్రేషన్ : ఎండలో ఎక్కువసేపు ఉండొద్దు

తీవ్రమైన ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల చెమట ద్వారా శరీరం నీటిని కోల్పోతుంది. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ఎండకు దూరంగా ఉండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ఉపయోగించడంతో పాటు నీటిని వెంట తీసుకెళ్లాలి.



విశేషంగా విద్యాలక్ష్మీ అమ్మవారి ఆరాధన

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి



:ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజైన శనివారం శ్రీ పద్మావతి అమ్మవారికి ఉదయం నవకలశ పూర్వక పంచామృతా భిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ధాన్యలక్ష్మి దేవిగా అలంకరించి అష్టలక్ష్మి మంటపంలో కొలువుదీర్చారు.శ్రీ సూక్త హవనం జరిపి పూర్ణాహుతి గావించారు.సాయంత్రం ధాన్యలక్ష్మి అమ్మవారిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగించారు. సహస్ర దీపాలంకార సేవను జల నారాయణ హారతిని వేడుకగా నిర్వహించారు.దసర శరన్నవరాత్రోస్థవాల్లో భాగంగా శ్రీ ధాన్యలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు విశేషంగా నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ముద్ర, యాదగిరిగుట్ట:



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారి దేవస్థానంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన సాయి కిరణ్ అకాడమీ, నటరాజ నృత్యాలయం జాహ్నవి హైదరాబాద్ ఆధ్వర్యంలో సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలలో చిన్నారుల గానం మంత్రముగ్ధులను చేసింది. మధురమైన స్వరాలతో సాగిన సంగీత విభావరిని భక్తులు ఆసక్తిగా తిలకిస్తూ, గానామృతాన్ని ఆస్వాదించారు. స్వామివారి సన్నిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తుల్లో భక్తిభావాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో సాయికిరణ్ అకాడమీ గురువు సాయికిరణ్, చిన్నారులు ఆరుట్ల వంశీ కృష్ణ, శ్రీ హర్ష, మనోజ్ పాల్గొన్నారు.

సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి



ముద్ర ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం–నల్లగొండ–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పిలుపునిచ్చారు. సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రఘురాం రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న కుటుంబం నుంచి వచ్చిన ఉన్నత విద్యావంతుడు సర్వోత్తమ్ రెడ్డి అని కొనియాడారు. పట్టభద్రుల సమస్యలను, వారి ఆకాంక్షలను శాసనమండలిలో సమర్థంగా ప్రస్తావించేందుకు ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు నవంబరు 6వ తేదీ వరకు మాత్రమే ఉందని, అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా దరఖాస్తు చేసుకునేలా నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో అర్హులను గుర్తించి ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎల్ నినో ను ఎదుర్కొనేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ఎల్ నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్, సాగునీరు, వి. బి. జీ రాంజీ ఉపాధి హామీ పనులు, భూగర్భాలాలు అవసరాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపకల్పన పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, గ్రామీణ అభివృద్ధి శాఖ,జిల్లా వ్యవసాయ, నీటి పారుదల, భూగర్భ జల శాఖ, ఎన్ పీ డీ సీ ఎల్, మిషన్ భగీరథ,జిల్లా పంచాయతీ అధికారి తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ భూగర్భ జలాలు రాను రాను తగ్గుతుండడంతో రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్, అవసరాలకు సంబంధించి గ్రామ సభలలో సర్పంచుల అధ్యక్షతన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలన్నారు.తాగు నీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వ్యవసాయ అధికారులు సూచన మేరకు రైతులు వరి వేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలన్నారు.వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటల తదితర పంటల సాగుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మండలాల వారీగా నీటి వనరుల లభ్యత ఆధారంగా పంటలు సాగు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులనుఆదేశించారు. యాసంగి సీజన్లో వరి సాగుకు నీటి లభ్యత ఉండే అవకాశం లేనందున రైతులను వరి సాగు నుంచి దూరంగా ఉంచేందుకు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీనా భవృద్ధి అధికారి నాగిరెడ్డి , డిప్యూటీ కమీషనర్ సరిత,డీపీఓ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జానయ్య , ఈఈ పీఆర్, మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖ, మండల తహసీల్దార్, ఎంపిడిఓ, మండల స్పెషల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

జనసేనలో చేరిన అడ్వకేట్ కనకదుర్గ



ముద్ర, ఖమ్మం: 0సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో కొనసాగుతున్న న్యాయవాది, సామాజిక కార్యకర్త మునిగంటి కనకదుర్గ హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసంలో ఆయన సమక్షంలో జనసేనలో చేరారు. ప్రజాసమస్యలపై అవగాహనతో పాటు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కనకదుర్గ గతంలో ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, రాహుల్ గాంధీ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆమె, కేసీఆర్ ఫౌండేషన్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, యువత పట్ల ఆయన చూపించే ప్రత్యేక శ్రద్ధ నచ్చి, ప్రజలకు నిజమైన పరిపాలనా ఫలాలను అందించాలనే లక్ష్యంతోనే జనసేనలో చేరినట్లు కనకదుర్గ వెల్లడించారు.

చిన్నారి కళ్లల్లో ఆశల వెలుగులు..

వినయ్ కల నెరవేర్చిన కేటీఆర్, కందాళ!



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 17 : జీవితంతో పోరాడుతున్న ఓ చిన్నారి గుండెల్లో ఎన్నో ఆశలు, మరెన్నో కలలు. అందులోనూ తనకెంతో ఇష్టమైన నాయకుడిని ఒక్కసారైనా కళ్లారా చూడాలని, ఆయనతో కలిసి ఫొటో దిగాలన్నదే ఆ బాలుడి కోరిక. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నరసింహులగూడెం కు చెందిన కర్నె ఆదినారాయణ కుమారుడు 13 ఏళ్ల వినయ్ ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఒకవైపు జబ్బుతో పోరాడుతూనే, తన అభిమాన నాయకుడు కేటీఆర్‌ను కలవాలనే బలమైన ఆకాంక్షను ఆ చిన్నారి తన మనసులో దాచుకున్నాడు.ఈ నేపథ్యంలోనే వినయ్ కుటుంబ సభ్యులు తమ బిడ్డ కోరికను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కందాళ ఉపేందర్ రెడ్డి ఆ బాలుడి పరిస్థితిని అర్థం చేసుకుని, కేటీఆర్ ను కలిసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.హైదరాబాదులోని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి నివాసంలో వినయ్‌ను కేటీఆర్ స్వయంగా కలుసుకున్నారు. తన అభిమాన నాయకుడిని ఎదురుగా చూసేసరికి వినయ్ ముఖంలో చెప్పలేనంత ఆనందం వెల్లివిరిసింది. కేటీఆర్ ఎంతో ఆప్యాయంగా ఆ బాలుడిని పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న వయసులో అనారోగ్యంతో బాధపడుతున్న ఆ బాలుడికి ధైర్యం చెప్పి, మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.తన ప్రాణాన మానుడైన నాయకుడిని కలుసుకోవడమే కాకుండా, ఆయనతో మాట్లాడి ఫొటో దిగడంతో వినయ్ కల నెరవేరింది. ఆ కొద్దిసేపు అనారోగ్య బాధలను మరచిపోయి ఆ చిన్నారి ముఖంలో చిరునవ్వులు విరబూశాయి. తమ బిడ్డ కోరికను నిజం చేసి, మానవత్వాన్ని చాటుకున్న మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డికి, ఆపద్బాంధవుడిగా నిలిచి భరోసానిచ్చిన కేటీఆర్‌కు వినయ్ తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నవంబర్ నాటికి వైద్య కళాశాల, తీగల వంతెన పూర్తి చేయాలి



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 17 : ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆదేశించారు. ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన పనులతో పాటు రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నాటికి వైద్య కళాశాలను అందుబాటులోకి తెచ్చేలా అన్ని భవనాలు, హాస్టళ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను నవంబర్ నెలాఖరు నాటికి సిద్ధం చేయాలన్నారు. బాలికల హాస్టల్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తీగల వంతెన తుది దశ పనులను కూడా నవంబర్ ఆఖరుకల్లా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణంలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తాగునీటి సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఆర్ అండ్ బీ ఎస్ఈ యుగంధర్, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 17 : హెల్త్ కార్డులు రాక, వైద్యం అందక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్‌జీపీఏటీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశపల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కృషిభవన్‌లో జరిగిన సంఘ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు నెలలుగా ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ప్రీమియం మినహాయిస్తున్నప్పటికీ.. కార్డులు ఇవ్వడంలో, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.2024 మార్చి తర్వాత విరమణ పొందిన పెన్షనర్ల బకాయిల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలని, మూడు విడతల డీఆర్ మంజూరు చేయాలని, పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఆర్ బిల్లుల ఇబ్బందులను తొలగించాలని, ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాల్లో పెన్షనర్ల భవనాలు నిర్మించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్లు అందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

ప్లకార్డులతో ఎన్ పి ఆర్ డి నిరసన



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : పేదలవి 13 కోట్లు ఓట్లను తొలగించిన కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి వినాయక చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షులు సుర్పంగా ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఓట్లు తొలగింపు చర్యల వల్ల పేదల అరులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ పి ఆర్ డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోల్లపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, జిల్లా పండాల శ్రీహరి, నాయకులు టీ మధు, వల్లాల రాధాకృష్ణ, కందుల కృష్ణమూర్తి, ఎస్కే నశీనా బేగం, ఎస్కే రషీద్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌తో మంత్రి తుమ్మల భేటీ

సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమంపై కీలక ప్రతిపాదనలు



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 17 : రాష్ట్రంలో రైతుల భూములను పరిరక్షించడం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని గణనీయంగా తగ్గించడం, ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలు కీలక ప్రతిపాదనలతో లేఖలు అందజేశారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా తెరిచిన కాలువలకు బదులు సాంకేతికంగా అనుకూలమైన చోట పైపుల వ్యవస్థను అమలు చేయాలని కోరారు. దీనివల్ల సుమారు 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో రూ.2,148.74 కోట్ల వరకు తగ్గింపు సాధ్యపడుతుందని, నిర్మాణ రంగంలోనూ మరో రూ.1,807.82 కోట్ల వరకు ఆదా చేసే అవకాశం ఉందని వివరించారు.దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో సుమారు ఒక టీఎంసీ నీటిని తాత్కాలికంగా నిల్వ చేయడం ద్వారా మూడు జిల్లాలకు తాగునీరు అందించవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల్లో చెట్ల ఆకులు తగలడం వల్ల ఏర్పడుతున్న విద్యుత్తు అంతరాయాలు, ప్రమాదాలను నివారించేందుకు 11 కేవీ లైన్లకు కవర్ కండక్టర్లు ఏర్పాటు చేయాలని, కొత్త తోటల అనుమతుల సమయంలోనే ఈ మార్పిడిని ప్రణాళికలో చేర్చాలని సూచించారు. ఖమ్మం నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టుల డీపీఆర్‌లకు ఆమోదం తెలపాలని, డిసెంబరు 9న కల్లూరిగూడెం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో పాటు వెలుగుమట్ల హౌసింగ్ మోడల్ కాలనీని ప్రారంభించడానికి రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరడంతో పాటు, యాతాలకుంట కుంట టన్నెల్, సీతమ్మ సాగర్ అనుమతులు, జూలూరుపాడు టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

తంగెళ్ల రామకృష్ణారెడ్డికి పరామర్శ



ముద్ర, దేవరకొండ:చందంపేట మండలంలో గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి రామకృష్ణారెడ్డి దేవరకొండలో సాయిబాబా టెంపుల్ దగ్గర బైక్ మీద వెళ్తుంటే ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీకొనడం వలన రామకృష్ణారెడ్డి కి తీవ్రమైన గాయాలవడం వలన హైదరాబాద్ మలక్‌పేటలోని యశోద ఆసుపత్రికి తరలించారు వెంటిలెటర్ మీద చికిత్స పొందుతున్న రామకృష్ణారెడ్డి ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన దేవరకొండ తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ నేనావత్ శివ నాయక్ వారితోపాటు నేరేడుగొమ్ము మండల ఇన్చార్జి ఇప్ప జగన్ రెడ్డి ఉన్నారు.ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. రామకృష్ణారెడ్డికి మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని శివ నాయక్ వైద్యులకు సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దని, రామకృష్ణారెడ్డికి మెరుగైన వైద్యం అందేలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శివ నాయక్ , జగన్ రెడ్డి ,పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

31న ఐలు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ఈనెల 31న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐ లు యాదాద్రి భువనగిరిజిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని,దేశంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, అసమ్మతి వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసుల ద్వారా సాగిస్తున్న నిర్బంధాన్ని నిరసిస్తూ 23న దేశవ్యాప్త నిరసనల ను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది మామిడి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన ఐలు జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఐలు జిల్లా అధ్యక్షుడు బొల్లేపల్లి కుమార్ అధ్యక్షత వహించగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, యువత, మహిళలు, మీడియా ప్రతినిధులపై పోలీసుల దాడులు, అక్రమ అరెస్టులు చేయడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అన్ని ప్రజాసంఘాలు, న్యాయవాదులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ లు, జిల్లా కోశాధికారి బొడ్డు కిషన్, జిట్ట భాస్కర్ రెడ్డి, పిడుగు ఐలయ్య పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : సద్దుల బతుకమ్మ సంబరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం భువనగిరి పట్టణంలోని స్థానిక చెరువు కట్ట వద్ద జరగబోవు బతుకమ్మ పండుగ సంబరాలను పురస్కరించుకొని ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె చంద్రప్రకాష్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సుజాయత్ అలి కౌసర్, అధికారులు పాల్గొన్నారు.


మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ముద్ర, బీబీనగర్: బీబీనగర్ పట్టణంలో శ్రీ తుల్జా భవాని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో శనివారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారి రూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీబీనగర్ మండల మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని గోలి ప్రణీత పింగల్ రెడ్డి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి పెరబోయిన బస్వరాజ్ యాదవ్, బీబీనగర్ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 18.10.2026
www.mudranews.in | @mudranews

డీహైడ్రేషన్ : నీటిని తరచూ తాగండి



శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండాలంటే రోజంతా కొద్దికొద్దిగా నీటిని తాగాలి. దాహం వేసే వరకు వేచి చూడకుండా నీటిని తీసుకోవడం మంచిది. ఎండలో పనిచేసేవారు, వ్యాయామం చేసేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

అమ్మా భారమంతా నీదే..!





శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఏడుపాయల వన దుర్గ భవాని మాత శ్రీ లలితాత్రిపురసుందరి(కాళరాత్రి) దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మెదక్ పట్టణంలో కాళికాదేవి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయం, చమన్, మిలిటరీ కాలనీ హనుమాన్ మందిరాల వద్ద అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. పాపన్నపేట మండల కేంద్రంతో పాటు కొడపాకలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహాలక్ష్మి అమ్మ అవతారంలో అమ్మవారి దర్శనం ఇవ్వగా విగ్రహ దాత, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం పిఆర్ఓ బెజుగం ఉప్పల శంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. హవేలీ ఘనాపూర్ మండలం జక్కన్నపేట కూచనపల్లి సర్దన తదితర గ్రామాలలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రామాయంపేట మండలం లక్ష్మాపూర్ దుర్గ మాత ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు.

- ముద్ర ప్రతినిధి,, మెదక్

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 17 : టీఎన్జీవోస్ జిల్లా యూనియన్ కార్యాలయంలో ఎనిమిదో రోజు 'వెన్నముద్దల బతుకమ్మ' వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. టీఎన్జీవోస్ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు.మహిళా ఉద్యోగులు తీసుకొచ్చిన భారీ బతుకమ్మలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ పాటలు, నృత్యాలు, వెజిటేబుల్ మార్కెట్ మహిళల కోలాటాలతో యూనియన్ కార్యాలయం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు, టీజీఈ జేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ఉన్న విడదీయరాని అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, మహిళా విభాగం కన్వీనర్ జి.మృదుల, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ నాయకులు మల్లెల రవీంద్ర ప్రసాద్, జెడ్.ఎస్. జైపాల్, వల్లపు వెంకన్న, బెజ్జంకి ప్రభాకరాచారి, మహిళా ప్రతినిధులు లలిత కుమారి, రాధికా రెడ్డి, ఎన్. విజయ తదితరులు పాల్గొన్నారు.

ఫామ్ పాండ్లతో బహుళ ప్రయోజనాలు

కలెక్టర్ ప్రతిమా సింగ్



ముద్ర ప్రతినిధి, మెదక్:ఫామ్ పాండ్లతో బహుళ ప్రయోజనాలుంటాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. శనివారం పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో విబిజి రామ్ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ...పంటల సాగుకు నీటి కొరత లేకుండా, వర్షపు నీటిని ఒడిసిపట్టి అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకునేందుకు చేపడుతున్న ఫామ్ పాండ్ల నిర్మాణం,సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం, జలసిరి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫామ్ పాండ్ల నిర్మాణ పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత లోతు, ఎత్తు, పొడవులతో ఫామ్ పాండ్ల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలంలో, ప్రతీ గ్రామ పంచాయతీ లో ఐదు ఫామ్ పాండ్ల చొప్పున ఎంపిక చేసి, వాటి నిర్మాణ పనులను క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.నిర్మాణ పనులకు ప్రతిరోజూ ఎంత మంది కూలీలు హాజరవుతున్నారు, వారికి ఎంత మేర కూలి చెల్లిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీల హాజరును తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు, సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో భూగర్భ జల మట్టాల పెంపు, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వీబీ–జీ రామ్ జీ పథకం కింద అవసరమైన పనులను గుర్తించి, చేపట్టాలని సూచించారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మరమ్మతులు, ఇతర నీటి సంరక్షణ పనులకు సంబంధించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.వెంట డిఆర్ఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో విష్ణువర్ధన్, తహసిల్దార్ సతీష్, గ్రామ మాజీ సర్పంచ్ జగన్ పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

ఎమ్మెల్సీ తాతా మధు



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 17 : తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బతుకమ్మ వేడుకలను మహిళా నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించే మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలతో కలిసి పండుగలు జరుపుకోవడం బిఆర్ఎస్ ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఆడబిడ్డలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గౌరమ్మను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు, పోట్ల శ్రీనివాస్, బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



ముద్ర ప్రతినిధి, మెదక్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తూ, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. శనివారం వార్షిక తనిఖీలో భాగంగా కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరును సమీక్షించారు.నేరస్తులకు శిక్షలు పడేలా పటిష్ట ఆధారాలు సేకరించి, కోర్టుల్లో కేసుల నిరూపణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. దొంగతనాల నియంత్రణకు అనుమానితులపై నిఘా పెంచి, రాత్రి పెట్రోలింగ్‌ను పటిష్టం చేయాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు గ్రామస్థాయిలో ప్రజలతో సమన్వయం పెంచుకొని, స్థానిక సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పండుగల సందర్భంగా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమైన ఎస్పీ మాట్లాడుతూ.. విధులను క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలన్నారు. డయల్ 112కు వచ్చే అత్యవసర కాల్స్‌పై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర పోలీస్ సహాయం అందించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంపొందించేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ డియస్పి నరేందర్ గౌడ్, సీఐలు రంగా కృష్ణ, సందీప్ రెడ్డి, ఎస్సై అమర్, సిబ్బంది ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 17 : రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిప్రసాద్ భవన్‌లో గుడిమెట్ల రజిత అధ్యక్షతన అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పశ్య పద్మ మాట్లాడుతూ బాధితుల పక్షాన గత 12 ఏళ్లుగా పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాండ్ల పరిశీలనకు కేవలం మూడు కేంద్రాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల ప్రక్రియ ఆలస్యమవుతోందని, బాండ్ల పరిశీలన కేంద్రాల సంఖ్యను పదికి పెంచి, త్వరితగతిన పరిశీలన పూర్తి చేయాలని కోరారు.న్యాయస్థానం పర్యవేక్షణలో అగ్రిగోల్డ్ భూములను చిన్న చిన్న కమతాలుగా విడగొట్టి వేలం వేయడం ద్వారా బాధితులకు పూర్తి న్యాయం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రంలో ఈ విధానం విజయవంతంగా అమలవుతున్నందున, తెలంగాణలోనూ అదే రీతిలో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేంత వరకు బాధితులు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.అనంతరం అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా యర్రా బాబు, కార్యదర్శిగా గుడిమెట్ల రజిత, కోశాధికారిగా లక్షి నారాయణలను ఎన్నుకున్నారు.

బతుకమ్మ వారసత్వాన్ని భావితరాలకు అందించాలి

మంత్రి సీతక్క పిలుపు

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ బతుకమ్మ వేడుకల్లో మంత్రి



ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 17: పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప ఆస్తి, పండుగలు, సంప్రదాయాలు, ఆచారాలు సాంస్కృతిక విలువలు వంటి బతుకమ్మ పండుగను భావితరాలకు అందించాలని పంచాయతీరాజ్ , మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. సోమాజిగూడ లోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆవరణలో శుక్రవారం నాడు నిర్వహించిన బతకమ్మ పండుగ సంబరాలకు మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై మహిళలతో బతుకమ్మ ఆడారు. తెలంగాణలో ఆడపడుచు ఇంటికి వచ్చిన సందర్భంగా ఇంటిల్లిపాది కాకుండా ఊరంతా తీరొక్క పూలతో బతుకమ్మలు చేసి ఆటపాటలతో సంప్రదాయాన్ని చాటుకుంటారని మంత్రి గుర్తు చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కు వరుసగా రెండవసారి తాను బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం సంతోషమని సీతక్క అన్నారు. మన పూర్వీకులు అందించిన ఈ బతుకమ్మ పండుగ సంబరాలను మరింత సంప్రదాయంగా జరుపుకోవాలని ఆమె తెలంగాణ ఆడపడుచులకు పిలుపు నిచ్చారు. బతుకమ్మ వంటి సంప్రదాయ వారసత్వాన్ని ముందు తరాలకు అందించాలన్న సీతక్క ఈ సందర్భంగా బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ బతుకమ్మ వేడుకల్లో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయ కుమార్ రెడ్డి, రమేష్ వరికుప్పల,ఉపాధ్యక్షులు అత్తలూరి అరుణ, ఏ .రాజేష్, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఉమాదేవి, రాజేశ్వరి కళ్యాణం, మర్యాద రమాదేవి, రచన ముడుంబై, ఎన్. శ్రీనివాసరెడ్డి, అశోక్ దయ్యాల,అమిత్ బట్టు , సైకాలజిస్ట్ డాక్టర్ ఛాయా లత సహా సీనియర్ మహిళా జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు. మహిళా జర్నలిస్టుల తో సహా సీనియర్ మహిళా సభ్యులు ఆటపాటలతో ఈ బతుకమ్మ వేడుక ఉత్సాహంగా నిర్వహించారు.

22 నుంచి ఇంటింటి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

డిఎంహెచ్ఓ డా.గణేశ్వర్



ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లాలో ఈ నెల 22 నుండి నవంబర్ 4 వరకు ఇంటింటి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ తెలిపారు. శనివారం తెలంగాణ ప్రభుత్వం, కమీషనర్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, రాష్ట్ర కుష్ఠువ్యాధి నిర్మూలన విభాగం అడిషనల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ ఇచ్చారు. స్పర్శలేని ఎర్రని రాగి లేదా గోధుమ రంగు గల మచ్చలు వున్నచో, కాళ్ళు, చేతులలో తిమ్మిర్లు, చెమట రాకుండా ఉన్న మచ్చలు, అరచేతి లేదా పాదాల వేళ్ళు వంకరకావడం కష్టవ్యాధి కావచ్చు. నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో అంగవైకల్యం ఏర్పడుతుంది. కష్ణవ్యాధికి పూర్తి ఉచిత చికిత్స అందించబడుతుంది. కావున పైన చెప్పిన కష్ఠవ్యాధి లక్షణాలు కనిపిస్తే మీ ఇంటికి సర్వే కోసం వస్తున్న ఏ.ఎన్.ఎం.లు, ఆశ కార్యకర్తలకు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ తెలిపారు.శిక్షణలో డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డా. హరిప్రసాద్, పి.ఎం.ఓ. శంకర్ రాథోడ్, ఇంచార్జి మీడియా ఆఫీసర్ అన్వర్, డి.పి.ఎం.ఓ. సంతోష్ కుమార్, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం నివాసంలో విజయ్ దేవరకొండ, రష్మిక

రష్మికకు ప్రత్యేక బతుకమ్మ చీరను కానుకగా అందజేసిన డిప్యూటీ సీఎం దంపతులు



ముద్ర, హైదరాబాద్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాసానికి సినీ నటుడు విజయ్ దేవరకొండ, నటి రష్మిక మందన్న దంపతులు విచ్చేశారు. వివాహానంతరం తెలంగాణలో తొలి దసరా పండుగ జరుపుకుంటున్న సందర్భంగా రష్మికకు డిప్యూటీ సీఎం దంపతులు ప్రత్యేక బతుకమ్మ చీరను పండుగ కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగింది.

వరుణ యాగం నిర్వహించిన ఉప్పల్ ఎమ్మెల్యే



ముద్ర, ఉప్పల్: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చిలుకానగర్ శివాలయంలో వరుణ యాగం నిర్వహించారు. రైతులకు సాగునీరు సమృద్ధిగా అందాలని, పంటలు బాగా పండి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో స్థానిక బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555